ప్రజాశక్తి

సోమవారం 20 అక్టోబర్ 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

సొంత గనులతోనే విశాఖ ఉక్కు మనుగడ

▶ వార్త 4లో..

పేలిన బాణసంచా ధరలు

- గత ఏడాది కంటే రెండు రెట్లు అధికం
- బెంబేలెత్తుతున్న పేద, మధ్యతరగతి ప్రజలు
- నగరంలో 530 దుకాణాల్లో అధికారిక అమ్మకాలు



ఎయు మైదానంలో ఏర్పాటు చేసిన బాణసంచా విక్రయ కేంద్రాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వెలుగుల పండగ దీపావళి రానే వచ్చింది. విశాఖ నగరంలో ఈ పండగను ఏటా ఘనంగా నిర్వహిస్తుంటారు. అందుకు తగ్గట్టు ఏటా బాణసంచా కొనుగోళ్లు సాగుతుంటాయి. అయితే, ఈ సారి బాణసంచా ధరలు నింగిని తాకాయి. దీంతో పేద, మధ్యతరగతి ప్రజలు బాణసంచా కొనుగోళ్లకు వెనకడుగు వేస్తున్నారు. కొందరు గతంలో కొనుగోలు చేసిన విధంగా కాకుండా తక్కువ మొత్తంలో కొనుగోలు చేసేందుకు మక్కువ చూపుతున్నారు.

ధరలిలా..


గత ఏడాది కంటే రెండు రెట్లు ధరలు అధికంగా ఉన్నట్లు కొనుగోలుదారులు చెబుతున్నారు. అతి తక్కువ స్థాయిలో కొనుగోలు చేసే సామగ్రి సైతం వందల్లో ఉంది. బాంబుల ధరలు వేలలోనే ఉన్నాయి. ఇక షాట్స్ ధరలు ఊహకు అందడం లేదని వీటిని అధికంగా కొనుగోలు చేసే యువత అంటున్నారు. 20, 50, 100 షాట్స్ బట్టి ధరలు నిర్ణయించి అమ్మకాలు సాగుతున్నాయంటున్నారు. లక్ష్మీ బాంబులు, చీమ టపాకాయలు ధరలు భారీగానే ఉన్నాయి. ఈసారి చీమ టపాకాయలలో 1000 వాలా, 2000 వాలా, 5000 వాలా ధరలు విపరీతంగా పెరిగాయి. తారాజువ్వలు చిన్నవి మాత్రమే దుకాణాలలో అమ్మకాలు చేస్తున్నారు. పెద్ద జువ్వల కోసం అనకాపల్లి మొగలి పురం ప్రాంతాలకు వెళ్లి తెచ్చుకునే పరిస్థితి ఉంది. సామాన్య మధ్య తరగతి ప్రజలు అగ్గిపెట్టెలు, కాకరపువ్వొత్తులు, వెన్న ముద్దలు, పాము బిల్లలతో సరి పెట్టుకోక తప్పని పరిస్థితి. పెద్ద సామగ్రి కొనాలంటే వేలాది రూపాయల ఖర్చు చేయాలి. ఇక ఫ్యామిలీ ప్యాక్ అంటూ రూ.550 నుంచి రూ.3000 ధరలు నిర్ణయించి వ్యాపారులు అమ్మకాలు చేస్తున్నారు.

మట్టి ప్రమిదల అమ్మకాలు జోరు

పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకొని పలువురు మిగతా 2లో..

నేటి పిజిఆర్ఎస్ రద్దు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దీపావళి ప్రభుత్వ సెలవు దినం కారణంగా సోమవారం కలెక్టరేట్‌లో జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అధికారులు ఎవరూ అందుబాటులో ఉండరని, ఫిర్యాదుదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.



కెజిహెచ్‌లో ఆధునిక వైద్య సేవలు

'ప్రజాశక్తి'తో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి

▶ వార్త 2లో..

మొదటి పేజీ తరువాయి..

పేలిన బాణసంచా ధరలు

మట్టి ప్రమిదలను కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపిస్తున్నారు. వీటి ధరలు అధికంగా ఉన్నప్పటికీ కొనుగోలు పెరగటం మంచిదేనని పర్యావరణ ప్రేమికులు అంటున్నారు. దొండపర్తి జంక్షన్, జగదాంబ ప్రాంతాలలో మట్టి ప్రమిదల అమ్మకాలు జోరుగా జరుగుతున్నాయి. కొందరు తోపుడుబండ్లపై వీధులలో తిరుగుతూ మట్టి ప్రమిదల అమ్మకాలు చేస్తున్నారు.

530 స్టాళ్లకు అనుమతి

నగర పరిధిలో 530 దుకాణాలకు అనుమతి ఇవ్వగా అత్యధికంగా ఆంధ్ర యూనివర్సిటీ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేశారు. ఇక్కడ 130 వరకు బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేయగా, ఎఎస్ రాజా కాలేజీ గ్రౌండ్స్‌లో 46, ఓజోన్ వ్యాలీలో 29, గాజువాకలో 48, మల్కాపురంలో 46, పెందుర్తిలో 7, సుజాతనగర్ లో 16, గోపాలపట్నం పెట్రోల్ బంక్ ప్రాంతంలో 35 దుకాణాలు ఏర్పాటు చేశారు. ఇవి కాకుండా మరికొన్ని ప్రాంతాల్లో 1 నుంచి 5 దుకాణాల ఏర్పాటుకు సంబంధించి అనుమతులు ఇచ్చారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది దుకాణాల ఏర్పాటు ఆలస్యంగా జరిగింది. అయితే చెన్నయ్ నుంచి లైసెన్సు కలిగి ఉన్న యజమానులు మాత్రం షీలా నగర్, ఉక్కునగరం, గంభీరం ప్రాంతాలలో కొద్దిరోజులుగా అయ్యన్ టపాసుల అమ్మకాలు చేపడుతూ వచ్చారు. బాణసంచాకు సంబంధించిన జిఎస్‌టి చెల్లించిన బిల్లు, దుకాణం ఏర్పాటు చేస్తున్న స్థలానికి సంబంధించిన ఎన్‌ఒసి, అగ్నిమాపక శాఖ నిబంధనలను పరిగణలోకి తీసుకొని వీటి ఏర్పాటుకు జివిఎంసిలోని ప్రాంతీయ అగ్నిమాపక శాఖ అధికారి కృపావరం అనుమతులిచ్చారు. ప్రతి స్టాల్ వద్ద తప్పనిసరిగా నీరు, ఇసుక బకెట్లు, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు అందుబాటులో ఉండాలని, రెండు స్టాల్స్ మధ్య నిర్దిష్ట దూరం పాటించాలని నిబంధనలు పెట్టి షరతులతో కూడిన అనుమతులు ఇచ్చారు.

వైసిపి క్రిస్టియన్ మైనార్టీ సెల్ కార్యదర్శిగా రాజశేఖర్



ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగరంలోని కెఆర్ఎం.కాలనీ ప్రాంతానికి చెందిన కందిమల్ల రాజశేఖర్ వైసిపి జిల్లా క్రిస్టియన్ మైనార్టీ సెల్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ అధ్యక్షులు, మాజీ సిఎం వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. కేంద్ర కార్యాలయం నుండి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ పార్టీ కోసం అహర్నిశలూ పనిచేసే వారికి తప్పక గుర్తింపు దక్కుతుందన్నారు. తనకు ఈ పదవి రావడానికి సహకరించిన పార్టీ సీనియర్ నాయకులు బొత్స సత్యనారాయణ, పార్టీ ఉత్తరాంధ్ర ఇన్‌ఛార్జి కురసాల కన్నబాబు, విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు కెకె.రాజు, అనకాపల్లి జిల్లా అధ్యక్షులు గుడివాడ అమర్‌నాథ్, విశాఖపట్నం తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావులకు కృతజ్ఞతలు తెలిపారు.



దీపావళి వేడుకల్లో సన్ ఇనిస్టిట్యూట్ విద్యార్థులు, యాజమాన్యం

సన్ ఇనిస్టిట్యూట్‌లో దీపావళి వేడుకలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలను చాటి చెప్పేవి తెలుగు పండుగలేనని సన్ ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆశా జాస్తి పేర్కొన్నారు. సన్ క్యాంపస్‌లో శనివారం సాయంత్రం ప్రీ దివాళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి పర్యావరణహిత దీపాలను వెలిగిస్తూ ఈ వేడుకలకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సన్ విద్యార్థులు తెలుగు సంస్కృతి సాంప్రదాయాన్ని నిరంతరం గుర్తించుకునేలా కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ప్రతి ఒక్కరు దివాళి వేడుకలను పర్యావరణహితంగా జరుపుకోవాలని విద్యార్థులకు తెలియజేస్తూ ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. తెలుగు సాంప్రదాయాన్ని చాటి చెప్పేలా విద్యార్థులు స్వయంగా తయారు చేసిన పిండి వంటలను ప్రదర్శించారు. తదుపరి విద్యార్థులు తెలుగు సంస్కృతిని ప్రతిబింబించేలా సాంప్రదాయ దుస్తులతో చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నిత్య జాస్తి, అధ్యాపకులు, పెద్ద సంఖ్యలో విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్యుల సేవలు అమోఘం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: సమాజంలో ఎంతోమందికి ప్రాణదాతలుగా నిలుస్తున్న వైద్యులను సత్కరించుకోవడం అభినందనీయమని విశాఖ తూర్పు శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. ఆదివారం ఎంవిపి కాలనీలో ప్రముఖ పల్మనాలజిస్ట్ కేత ఫణిందర్ ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం పలువురు వైద్యులను గురువులను ఆయన సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా సమయంలో డాక్టర్ ఫణీందర్ ఎంతో మంది ప్రాణాలు కాపాడారని, ఇప్పుడు తన మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించడంతో పాటు రక్తదాన శిబిరం, మందులు పంపిణీ చేసిన ఘనత కూడా ఆయనకే దక్కుతుందన్నారు.

అమెరికా ఆధిపత్య ధోరణిని వ్యతిరేకిద్దాం



మాట్లాడుతున్న లోకనాథం

ట్రంప్ విధానాలు దేశానికి చేటు
కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.లోకనాథం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రారంభించిన వాణిజ్య యుద్ధం భారతదేశంతో సహా ప్రపంచ దేశాలన్నింటిపైనా తీవ్ర ప్రభావం చూపుతోందని కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.లోకనాథం అన్నారు. అమెరికా ఆధిపత్య ధోరణిని అందరూ వ్యతిరేకించాలన్నారు. ఎమ్‌డి ఆనంద్ బాబు అధ్యక్షతన సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం విశాఖలోని జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో ఆదివారం జరిగింది. అనంతరం 'ట్రంప్ సుంకాలు - భారత ప్రజలపై ప్రభావం' అన్న అంశంపై లోకనాథం మాట్లాడారు. ట్రంప్ సుంకాల వల్ల మన దేశంలోని వ్యవసాయ రంగంపై ప్రభావం ఉంటుందన్నారు. సేవారంగం గందరగోళంలో పడి మొత్తం ఆర్థిక సంక్షోభాన్ని తీవ్రతరం చేస్తుందన్నారు. రాష్ట్రంలోని ఆక్వా, టెక్స్‌టైల్, గార్మెంట్, పట్టు వంటి రంగాలు తీవ్రంగా దెబ్బతింటాయన్నారు. ఉద్యోగులు, కార్మికులు, రైతాంగం రోడ్డున పడి ఇంటా బయటా ఉపాధి అవకాశాలు దెబ్బతింటాయన్నారు. విద్యార్థులు, యువత భవిష్యత్తు అగమ్య గోచరమవుతుందన్నారు. ఈ పరిస్థితిని ఎదుర్కొని మన దేశ ప్రయోజనాలు కాపాడుకునేలా ప్రత్యామ్నాయ మార్గాలను అందిపుచ్చుకోవలసిన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ట్రంప్ అడుగులకు మడుగులొత్తే లొంగుబాటు వైఖరిని ప్రదర్శిస్తోందని విమర్శించారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి మన దేశం అనుసరిస్తున్న స్వతంత్ర విదేశాంగ విధానానికి మోడీ ప్రభుత్వం తూట్లు పొడుస్తోందన్నారు. మన దేశ సార్వభౌమత్వానికి ముప్పు కలుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా దేశ ప్రజలంతా ఉద్యమించవలసిన తరుణం ఆసన్నమైందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల ప్రయోజనాలు కాపాడే వైఖరి తీసుకునేలా ఒత్తిడి పెంచాల్సి ఉందన్నారు. ట్రంప్ సుంకాల పెంపుదల వల్ల రాష్ట్రం తీవ్రంగా నష్టపోతోందన్నారు. రొయ్యల ధరలు పడిపోయి సముద్ర తీర జిల్లాల్లోని ఆక్వా రైతులు, వాటిపై ఆధారపడినవారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేందుకు టిడిపి కూటమి ప్రభుత్వం కేంద్రంపై అన్నివిధాలా ఒత్తిడి తేవలసిందిపోయి అమెరికా ఆంక్షలపై స్పందించకుండా మౌనం వహిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంధ్ర మాల్యాద్రి, రాష్ట్ర ఉపాధ్యక్షులు తిరుకోటి చిరంజీవి, బొమ్మల రఘురామ్, కె.రంగమ్మ, కె.క్రాంతి బాబు, ఎ.తిరుపాల్, రాష్ట్ర నాయకులు మద్దేల సుబ్బన్న, ఈరెల్లి చిరంజీవి, జువ్వల రాంబాబు, విజయ్, నాగేశ్వరావు, మల్లవరపు కుటుంబరావు, జొన్నకూటి నవీన్ ప్రకాష్, కృష్ణ, కరుణాకర్, విజయమ్మ, రమణ పాల్గొన్నారు.

కెజిహెచ్‌లో ఆధునిక వైద్య సేవలు



రూ.40 కోట్లతో కేన్సర్ విభాగానికి అధునాతన యంత్రాలు
'ప్రజాశక్తి'తో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి



ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర ఆరోగ్య ప్రదాయినిగా పేరుగాంచిన విశాఖపట్నం కెజిహెచ్‌లో ఆధునిక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని ఆ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి తెలిపారు. ఇటీవల ఆమెను 'ప్రజాశక్తి' పలకరించినప్పుడు పలు విషయాలను తెలియజేశారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే..

ఆధునిక కేన్సర్ వైద్య సేవలు ప్రారంభించినట్లు తెలిసింది.. ఎంతవరకు నిజం ?

కెజిహెచ్ కేన్సర్ విభాగంలో అత్యాధునిక వైద్య సేవలు ప్రారంభించాం. అందుకు అవసరమైన యంత్రాలను రూ.40 కోట్లతో ఏర్పాటు చేశాం. వీటిని సెప్టెంబర్ 1న రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ప్రారంభించారు. ఆయా పరికరాలకు అనుగుణంగా అన్ని వసతులూ సమకూరాయి. వైద్య సేవలు కొన సాగుతున్నాయి.

అందుబాటులోకి వచ్చిన ఆధునిక యంత్రాల్లో ఏమేమి ఉన్నాయి ?

ఆసుపత్రి రేడియో థెరపీ విభాగానికి లీనాక్, సీటీ సిములేటర్, బ్రాకీ థెరపీ యంత్రాలు ఉన్నాయి. నెల రోజుల వ్యవధిలో లీనాక్ యంత్రాలపై 25 మందికి, సీటీ సిములేటర్‌పై ఐదుగురికి పూర్తిస్థాయిలో సేవలు అందించాం. రేడియో థెరపీ విభాగాధిపతి డాక్టర్ శ్రీనివాసరావు, సహ ప్రొఫెసర్ డాక్టర్ పాండురంగ కుమారి, ఇతర వైద్యులు ఈ సేవలను అందిస్తున్నారు.

ఏయే రకాల కేన్సర్లకు వైద్యం అందుతోంది ?

పూర్తిస్థాయిలో సదుపాయాలు ఉన్నందున అన్ని రకాల కేన్సర్లకు చికిత్స అందిస్తున్నాం. బ్రెస్ట్ కేన్సర్‌కు సంబంధించి నిర్ధారణ పరీక్షలు చేసేందుకు మెమోగ్రఫీ యంత్రం అందుబాటులో ఉంది. గర్భాశయం ద్వారా వచ్చే కేన్సర్లకు సంబంధించి ప్యాప్స్ నియర్ పరీక్షలు నిర్వహిస్తున్నాం.

ఏయే రకాల కేన్సర్లకు సంబంధించిన కేసులు వస్తున్నాయి ?

గొంతు, ముక్కు, చెవి, గర్భాశయ, బ్రెస్ట్, బ్రెయిన్ తదితర కేన్సర్ కేసులు వస్తున్నాయి.

బ్రాకీ థెరఫీ సేవలు గురించి వివరిస్తారా ?

అణు శక్తి నియంత్రణ బోర్డు (ఎంఆర్‌బి) అనుమతులు రాగానే ఈ సేవలను ప్రారంభిస్తాం. దీని ద్వారా గర్భాశయ ముఖ ద్వార కేన్సర్‌కు చికిత్స అందించవచ్చు.

కేన్సర్ రోగులు కెజిహెచ్‌కు ఏయే రోజుల్లో రావొచ్చు ?

అనుమానిత కేన్సర్ కేసులకు ప్రతి మంగళ, శని వారాలు కెజిహెచ్ సిఎస్ఆర్ బ్లాక్‌లోని 200 ఒపి గదిలో ప్రత్యేకంగా ఒపి నిర్వహిస్తున్నాం.



ముఖ్యమంత్రి చంద్రబాబుతో రవికుమార్ తదితరులు

చంద్రబాబును కలిసిన కెనరా బ్యాంకు అధికారులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కెనరా బ్యాంకు అధికారుల సంఘం జనరల్ సెక్రటరీ కె.రవికుమార్ సహా పలువురు అధికారులు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును ఆదివారం ఉదయం మర్యాదపూర్వకంగా కలిశారు. విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు చేయడం వల్ల రాష్ట్ర, దేశ వ్యాప్తంగా ఐటి రంగంలో అపార అవకాశాలు కలుగుతాయని చెప్పారు.. దీనికి కృషి చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. రాజధాని అమరావతిలో అన్ని ప్రభుత్వ రంగ బ్యాంకుల కేంద్ర కార్యాలయాలకు స్థలం కేటాయించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

వంతెన పైనుంచే నీటి ప్రవాహం

- వర్షం పడితే నిలిచిపోతున్న రాకపోకలు
- రొయ్యల కంపెనీ వ్యర్థాల మురుగు నీటితో అవస్థలు

ప్రజాశక్తి- కొమ్మాది : వర్షాలు పడితే పరదేశిపాలెం జాతీయ రహదారి నుండి పాతపరదేశిపాలెం వెళ్లే దారిలో ఉన్న వంతెన పైనుండి నీటి ప్రవాహం ఉంటుంది. దీంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఇటీవల భారీ వర్షం కురవడంతో ఈ వంతెన పైనుండి నదీ ప్రవాహంలా నీరు ప్రవహించింది. దీంతో కొండపేట నూతన కాలనీ, పాత పరదేశిపాలెం, కె.నగరంపాలెం ప్రజలకు రాక పోకలు బందయ్యాయి. విపత్కర పరిస్థితులలో బయటకు వెళ్లేందుకు కూడా ఆ రహదారిలో వీలులేని పరిస్థితి ఏర్పడింది. ఇటీవల జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్, జోన్ 1 కమిషనర్ అయ్యప్ప నాయుడు, జోన్ 2 కమిషనర్ కె.కనకమహాలక్ష్మి, తహశీల్దార్ ఆ వంతెనను పరిశీలించారు. నూతన వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు తయారుచేయాలని జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. అయినా ఇప్పటికీ ఎటువంటి ప్రణాళికా రూపొందించలేదు.

ప్రభుత్వాలు మారుతున్నాయి, అధికారులు వస్తున్నారు పరిశీలిస్తున్నారు, ఆదేశిస్తున్నారే తప్ప వంతెన నిర్మాణం జరగటం లేదు, సమస్య పరిష్కారం కావటంలేదని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ముఖ్యంగా ఈ గెడ్డలోకి మారికవలస వద్ద ఉన్న రొయ్యల కంపెనీలు వ్యర్థాలను వదిలేయటంతో భారీగా గెడ్డ వస్తోందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రొయ్యల కంపెనీ వ్యర్థాలు, మురుగునీరు వదిలే సమయంలో విపరీతమైన దుర్వాసన వస్తోందని, దానిద్వారా అనారోగ్యాల పాలవుతున్నామని చెబుతున్నారు. ఈ గెడ్డ వచ్చే సమయంలో వంతెనపై నీరు ప్రవహిస్తుండగా అత్యవసర పరిస్థితిలో దాటేవారు గల్లంతై ప్రాణాలు కోల్పోయిన ఘటనలూ ఉన్నాయి. ప్రమాదాలు జరుగుతున్నా ఓట్లు కోసం వచ్చే నాయకులు కానీ, అధికారులు కానీ ఈ వంతెన సమస్య పరిష్కారం చూపించటం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. మరో ప్రత్యామ్నాయంగా ఉన్న కొండపేట నూతన కాలనీ నుంచి డంపింగ్ యార్డ్ రహదారి మట్టిది కావడం, కొండపై నుంచి వరద నీరు ఉధృతంగా రావడంతో రహదారి మొత్తం బురదమయంగా ఉంటోంది. దీంతో ఆ రహదారిలో ప్రయాణం సాధ్యపడడంలేదు. అధికారులు, నాయకులు స్పందించి వంతెన రహదారిపై ప్రయాణించే గ్రామాల ప్రజల సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

నేరాలు ఘోరాలు



గాయపడ్డ యువకునితో మాట్లాడుతున్న అనిత

రోడ్డు ప్రమాదంలో యువకునికి గాయాలు

కాన్వాయ్ ఆపి ఆసుపత్రికి పంపించిన హోంమంత్రి అనిత

ప్రజాశక్తి- నక్కపల్లి: నక్కపల్లి జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదంలో యువకుడు గాయపడడంతో, అటువైపు వెళుతున్న హోం మంత్రి అనిత కాన్వాయ్ ఆపి, ప్రమాద బారిన పడ్డ యువకుడుతో మాట్లాడి ఆసుపత్రికి పంపించారు. నక్కపల్లి సమీపంలో బైక్ పై వెళుతున్న యువకుడు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. అదే సమయంలో నెల్లూరు వెళ్తున్న హోం మంత్రి అనిత వెంటనే స్పందించి తన కాన్వాయ్ ఆపి, గాయపడ్డ యువకుడు వద్దకు వెళ్లి ప్రమాద పరిస్థితిని అడిగి తెలుసుకుని, ఆస్పత్రికి తరలించి మెరుగైన చికిత్స అందేలా చూడాలని సిబ్బందికి ఆదేశించారు.

దీపావళి సరుకుల పంపిణీ

ప్రజాశక్తి -తగరపువలస : దీపావళి సందర్భంగా తగరపువలస ప్రెస్‌క్లబ్‌లో విలేకరులకు బాణసంచా, స్వీట్ ప్యాకెట్లను వైసిపి నాయకులు మజ్జి సిరి పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జర్నలిస్టులు సమాజ సేవకులని, వారికి సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. ఎంపిపి వాసురాజు మాట్లాడుతూ, సిరి జర్నలిస్టులకు సహాయపడాలని అలోచిస్తారన్నారు. కార్యక్రమంలో ఎ.రామానాయుడు, కరుణాకర రెడ్డి, జీరు వెంకటరెడ్డి, వంశీ, పి.చంద్రశేఖర్, చెల్లూరు నాగేష్‌బాబు పాల్గొన్నారు.

హోమియో మందులు అందజేత

ప్రజాశక్తి -భీమునిపట్నం : కలిగొట్ల స్విర్ణ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంస్థ కార్యాలయం వద్ద ఆదివారం ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని ఫౌండేషన్ చైర్మన్ కె.శ్రీరామ చంద్రమూర్తి ప్రారంభించారు. 85 మందికి వైద్యులు టి.జగన్నాథరావు, టిజె.మోహన్ వైద్య పరీక్షలు చేశారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కెఎస్ఎన్.మూర్తి, కె.చంద్రశేఖర్, కెవి.భానోజీరావు, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆధీనంలోనే మెడికల్ కాలేజీలు



సంతకాల సేకరణలో పాల్గొన్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి -యంత్రాంగం

గాజువాక : ప్రభుత్వ ఆధీనంలోనే మెడికల్ కాలేజీలు ఉండాలని వైసిపి గాజువాక నియోజవర్గ పరిశీలకులు తైనాల విజయకుమార్ అన్నారు. జివిఎంసి 87వ వార్డు పరిధి కణితి కాలనీ గాంధీ బొమ్మ సెంటర్ వద్ద వార్డు అధ్యక్షులు బొడ్డ గోవింద ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా తైనాల మాట్లాడుతూ, జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 17 మెడికల్ కాలేజీల నిర్మాణం చేపట్టారని తెలిపారు. 7 కాలేజీలు పూర్తయ్యాయని, మిగిలినవి పనులు మధ్యలో ఉన్నాయని చెప్పారు. వాటన్నింటినీ కూటమి ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకు ఇచ్చేలా కుట్రలు చేస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ప్రగడ శ్రీనివాస్, చిత్రాడ వెంకటరమణ, ఎన్నేటి రమణ, ముద్దపు దామోదర్, దుగ్గపు దానప్పలు, పాల్గొన్నారు.

తగరపువలస : ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఆపాలంటూ జివిఎంసి రెండో వార్డు పరిధి నమ్మవానిపేటలో వైసిపి నాయకులు కోటి సంతకాల సేకరణ చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం మెడికల్ విద్యార్థులకు చేస్తున్న అన్యాయాన్ని వివరిస్తూ సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో చిల్ల భాస్కర్ రెడ్డి, బింగి హరికిరణ్ రెడ్డి, అక్కరమాని మంగరాజు, చిప్పాడ వెంకటేష్, నమ్మి మాధవరావు పాల్గొన్నారు.

ముగిసిన అనంతుని పవిత్రోత్సవాలు

ప్రజాశక్తి -పద్మనాభం : పద్మనాభ గ్రామంలో నాలుగు రోజులుగా నిర్వహించిన శ్రీ అనంత పద్మనాభ స్వామి పవిత్రోత్సవ కార్యక్రమాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా కొండపై ఉన్న అనంతుని దేవాలయంలోనూ, కొండ దిగుభాగం ఉన్న కుంతి మాధవస్వామి ఆలయంలోనూ ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. దేవాలయంలో హోమాలు జరిపారు. ఈ కార్యక్రమానికి పలు గ్రామాలు, పట్టణాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రాంబాబు, టిడిపి మండల పార్టీ మాజీ అధ్యక్షులు కె.నగేష్‌కుమార్, పద్మనాభం సర్పంచ్ ఇ.పాప ఎంపిటిసి సభ్యులు లక్ష్మీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఆచార్యులు దివాకర్‌రాయ్ మృతి

ప్రజాశక్తి -మధురవాడ : ఆంధ్ర యూనివర్సిటీ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం మాజీ ఆచార్యులు, సామాజిక వేత్త, ప్రముఖ హేతువాది డాక్టర్ కెవి.దివాకర్ రాయ్ (78) గుండె పోటుతో శనివారం మృతిచెందారు. అతని భౌతికకాయాన్ని సందర్శనార్థం పి.ఎం.పాలెం అశోకనగర్‌లోని వారి నివాసంలో ఉంచారు. దివాకర్‌రాయ్ నేత్రాలను దానం చేశారు. పార్థివదేహాన్ని వైద్య విద్యార్థుల పరిశోధన కోసం గీతం మెడికల్ కళాశాలకు ఆదివారం కుటుంబ సభ్యులు అప్పగించారు. రాయ్ భౌతికకాయాన్ని ఎయు మాజీ వీసీ బీల సత్యనారాయణ, నాగేశ్వరరావు, మాజీ ఉద్యోగులు రాధాకృష్ణ, ప్రజాశక్తి విశాఖ ఎడిషన్ పూర్వ మేనేజర్ ఎస్.సుధాకర్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.జగన్, డివైఎఫ్ఐ పూర్వ కార్యదర్శి ఎ.పైడిరాజు, అంబేద్కర్ వారసుల సంఘం అధ్యక్షుడు మండే మహేష్, దళిత సంఘం నాయకులు దడాల భాస్కరరావు, అశోక్‌నగర్ సొసైటీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.గౌతమ్‌బాబు, జి.మోహనరావు తదితరులు సందర్శించి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, దివాకర్ రాయ్ గొప్ప అభ్యుదయ వాది అన్నారు. అతని వద్ద అభ్యసించిన విద్యార్థులు అనేక మంది ఉన్నతులుగా ఎదిగారని గుర్తుచేశారు. నివాస ప్రాంత సమస్యలపై పనిచేశారని తెలిపారు. రాయ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే మన కర్తవ్యమని పేర్కొన్నారు.

చారిత్రక కట్టడాలను పునరుద్ధరించాలి

- ఎమ్మెల్యే గంటాకు వినతి

ప్రజాశక్తి -భీమునిపట్నం : చరిత్రను ప్రతిబింబించేలా చారిత్రక కట్టడాలను పునరుద్ధరించాలని కోరుతూ స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు ఆదివారం జివిఎంసి మూడో వార్డుకు చెందిన పలువురు టిడిపి నాయకులు విశాఖ నగరంలోని అతని నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. పురాతన పురపాలక సంఘ కార్యాలయాన్ని మ్యూజియంగా మార్పు చేయాలని, జోనల్ కార్యాలయం ఎదురుగా ఉన్న రహదారిని వాకింగ్ ట్రాక్‌గా నిర్మించాలని ఉప్పుటేరు వద్ద బోటు షికారు ఏర్పాటు చేయాలని, పురాతన పోర్టు అతిథి గృహాన్ని ఆధునీకరించి వినియోగంలోకి తేవాలని ఎమ్మెల్యేను కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో మాజీ కౌన్సిలర్ గొలగాని నరేంద్ర కుమార్, టిడిపి నాయకులు గాడు సన్యాసి నాయుడు, కనకల అప్పల నాయుడు, కంచర్ల కామేష్, జి.పోలిరాజు తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే గంటాకు వినతిపత్రం అందజేస్తున్న టిడిపి నాయకులు నరేంద్రకుమార్ తదితరులు

సొంత గనులతోనే విశాఖ ఉక్కు మనుగడ

స్టీల్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి లలిత్‌మిశ్రా

ప్రజాశక్తి-ఉక్కునగరం : సొంత గనులతోనే విశాఖ ఉక్కు మనుగడ సాధ్యమని స్టీల్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి లలిత్ మిశ్రా అన్నారు. ఉక్కు నగరంలో శనివారం ప్రారంభమైన స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) 12వ మహాసభ ఆదివారం ముగిసింది. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా లలిత్ మిశ్రా హాజరై మాట్లాడుతూ, ప్రభుత్వ రంగ పరిశ్రమలు, కార్మికులపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా జులై 9వ తేదీన చేపట్టిన సమ్మెలో 23 కోట్ల మంది భాగస్వామ్యం అయ్యారని తెలిపారు. దేశవ్యాప్తంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న నేషనల్ పైప్ లైన్ పేరుతో ప్రభుత్వ రంగ పరిశ్రమలను నిర్వీర్యం చేసి, మే డే స్ఫూర్తితో సాధించుకున్న 8 గంటల పని విధానాన్ని రద్దుచేసి 12, 13 గంటల పని విధానాన్ని బలవంతంగా రుద్దుతున్నారని విమర్శించారు. దేశవ్యాప్తంగా ఉన్న స్టీల్ పరిశ్రమలలో భద్రత కరువై విలువైన కార్మికుల ప్రాణాలు పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానంగా దేశంగా వ్యాప్తంగా నిరుద్యోగ వృద్ధి జరుగుతోందని, దీన్ని నివారించడానికి ప్రభుత్వ రంగ పరిశ్రమలను బలోపేతం చేయడం తప్ప మరొక మార్గం లేదని స్పష్టం చేశారు. కానీ వాటిని నిర్వీర్యం చేస్తున్నారనడానికి ప్రత్యక్ష సాక్ష్యంగా విశాఖ ఉక్కు కర్మాగారం నిలుస్తోందని చెప్పారు. ఈ పరిస్థితులను కార్మికులకు వివరిస్తూ, అవగాహన కల్పిస్తూ పోరాటాలకు సిద్ధం చేయవలసిన బాధ్యత మనపై ఉందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ మనుగడకు అవసరమైన సొంత గనులను కేటాయించకుండా ప్రైవేటీకరణకు అనుకూల నిర్ణయాలు తీసుకుంటూ పాలకులు దేశభక్తిని ఉచ్చరించడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. 2008లోనే ఐరన్ ఓర్ ఎగుమతులు రద్దు చేసి దేశీయ పరిశ్రమలకు సొంత గనులు కేటాయించి కాపాడాలని ఉద్యమించామని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ పోరాటంలో మనం ఎక్కడ ఉన్నాం, మన లక్ష్యం చేరుకోవడానికి అవసరమైన ప్రయత్నాలను ఎంతవరకు కొనసాగించామో సమీక్షించుకొని వాటికి అవసరమైన చర్యలు చేపట్టడమే ఈ మహాసభలో చర్చించాలని సూచించారు. నేటి ప్రభుత్వ విధానాలతో స్టీల్ కార్మికులపై ఆర్థిక నిర్బంధాన్ని, స్వేచ్ఛను మోతాదుకు మించి యాజమాన్యం హరిస్తోందన్నారు. దీనికి వ్యతిరేకంగా ఈ నూతన కార్యవర్గం పెద్ద ఎత్తున కర్మాగార రక్షణ కోసం, కార్మిక హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమాలను ఉధృతం చేయాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు.

ముందుగా మహాసభల ప్రారంభ సూచికగా స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు వైటి దాస్ పతాకావిష్కరణ చేశారు.

స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ నూతన గౌరవాధ్యక్షులు ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్‌లో కార్మిక వర్గంపై యాజమాన్య నిరంకుశ నిర్బంధానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, సీనియర్ నాయకులు ఎన్.రామారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లలిత్‌మిశ్రా, వేదికపై సిహెచ్.నర్సింగరావు, జగ్గునాయుడు తదితరులు

నూతన కమిటీ ఎన్నిక



అయోధ్యరామ్



రామస్వామి

మహాసభల ముగింపులో నూతన కమిటీని ఎన్నుకున్నారు. స్టీల్ సిఐటియు అధ్యక్షులుగా యు.రామస్వామి, ప్రధాన కార్యదర్శిగా జె.అయోధ్య రామ్, 10 మంది యూనియన్ సెక్రటేరియట్ మెంబర్లుగా, 60 మంది ఆఫీస్ బేరర్లుగాగా, 150 మంది వర్కింగ్ కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

జాగ్రత్తలతో దీపావళి

ప్రజాశక్తి-సీతమ్మధార : దీపావళిని జాగ్రత్తలు పాటిస్తూ చేసుకోవాలని విశాఖపట్నం ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.మీనాక్షి సూచించారు. పటాసులు కాల్చినప్పుడు రక్షణగా కంటి అద్దాలు ధరించాలని, చేతుల్లో పెట్టి కాల్చరాదని తెలిపారు. కాటన్ దుస్తులు ధరించాలని, దగ్గరలో నీళ్ల బకెట్ ఉంచుకోవాలని, పిల్లలు, పెద్ద సమక్షంలో పటాసులు కాల్చేలా చూడాలని సూచించారు. పటాసులు వల్ల కంటికి గాయాలైతే వెంటనే నేత్ర వైద్య నిపుణులను సంప్రదించాలని కోరారు. సొంత వైద్యం వద్దని తెలిపారు. నిర్లక్ష్యం చేస్తే కార్నర్ అంధత్వం, శాశ్వత అంధత్వం బారిన పడే అవకాశముందని వివరించారు. దీపావళి రోజున కంటికి ఎటువంటి ప్రమాదం సంభవించినా విశాఖ రామా టాకీస్ రోడ్డులోని ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆస్పత్రిలో ఉచిత చికిత్సలు చేస్తామని తెలిపారు.



సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న కళింగ యూత్ వెల్ఫేర్ సభ్యులు

'మాధవధార కళింగ యూత్'
గౌరవాధ్యక్షులుగా సనపల నరేందర్

ప్రజాశక్తి-మాధవధార : మాధవధార కళింగ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులుగా సనపల నరేందర్ నియమితులయ్యారు. మాధవధార తోటలో మాధవధార కళింగ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షులుగా నంబాల ఈశ్వరరావు, ఉపాధ్యక్షులుగా తమ్మినేని వెంకటేష్, కార్యదర్శిగా సనపల శ్రీకాంత్, సహాయక కార్యదర్శిగా సనపల పటేల్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పేడాడ మణికంఠ, కోశాధికారిగా మూల లక్ష్మణరావు, సహాయక కోశాధికారిగా పేడాడ శ్రీకాంత్, సభ్యులుగా సనపల హరిబాబు, సనపల వెంకటరావు, అన్నెపు రవికుమార్, నంబా ల సురేష్, పూజారి సురేష్, సనపల సీతారాం, కూన వాసు, కూన మణికంఠ, సనపల వెంకటరావు, సనపల లక్ష్మీకాంత్, కొప్పుల శ్రావణ్ కుమార్, పైడి సంతోష్, కనమట సాయి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గౌరవాధ్యక్షులు సనపల నరేందర్ మాట్లాడుతూ, అసోసియేషన్ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందజేస్తానన్నారు.

జర్నలిస్టుల పిల్లలకు ప్రోత్సాహకం

ప్రజాశక్తి-సీతమ్మధార : సమాజం కోసం నిరంతరం పాటుపడే జర్నలిస్టులతో పాటు వారి పిల్లలను కూడా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు అన్నారు. ఇద్దరు సీనియర్ జర్నలిస్టుల పిల్లలకు విద్య, క్రీడా ప్రోత్సాహకాల కింద గంట్ల శ్రీనుబాబు రూ.25 వేలు ఆదివారం అందజేశారు. విద్యతోపాటు కరాటేలో రాణిస్తున్న ఫొటో జర్నలిస్టు గణేష్ కుమారుడు సిహెచ్ మనోజ్ యాదవ్‌కు రూ.10 వేలు, బిటెక్ చదువుతున్న మరో జర్నలిస్టు కుమార్తెకు రూ.15 వేలు అక్కయ్యపాలెంలోని యూనియన్ కార్యాలయంలో అందజేశారు. ఈ విద్యా సంవత్సరంలో సుమారు 139 మంది జర్నలిస్టుల పిల్లలకు ఉపకార వేతనాలు అందజేసినట్లు శ్రీనుబాబు వివరించారు.

బిఆర్‌టిఎస్ రహదారి బొగ్గుమయం

ప్రజాశక్తి- వేపగుంట : జివిఎంసి జోన్-8 పరిధిలోని బిఆర్‌టిఎస్ రహదారి బొగ్గు మయమవుతోంది. గుట్టలుగుట్టలుగా బొగ్గు పడి ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. విశాఖపట్నం పోర్టు నుంచి విజయనగరం జిల్లా కొత్తవలస సమీపంలోని కంపెనీలకు లారీలతో బొగ్గు రవాణా జరుగుతోంది. పరిమితికి మించిన లోడుతో లారీలు వెళ్లడంతో రోడ్లపై బొగ్గు పడిపోతుంది. ముఖ్యంగా స్పీడ్ బ్రేకర్లు ఉన్నచోట గుట్టలు గుట్టలుగా బొగ్గు పడి ఉంటుంది. దీన్ని తొలగించేందుకు ప్రతిరోజూ శానిటేషన్ సిబ్బంది ప్రత్యేకంగా సమయం కేటాయించాల్సి వస్తోంది. ప్రధాన బిఆర్‌టిఎస్ రోడ్డు కావడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ఆందోళన వ్యక్తమవుతోంది. గతంలో జోన్-8 అధికారులు బొగ్గు లారీలకు జరిమానా విధించినా వారిలో మార్పు రాలేదు. రోడ్డు రవాణా శాఖ అధికారులు దృష్టి సారించి ఈ సమస్యకు పరిష్కారం చూపాలని పలువురు కోరుతున్నారు.



బిఆర్‌టిఎస్ రహదారిలో పడిన బొగ్గును తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది

'దీపావళి' అనుమతులు ఆలస్యం

వ్యాపారుల్లో ఆందోళన

ప్రజాశక్తి-పెందుర్తి: జివిఎంసి 95 వార్డు పరిధి పాపరాజుపాలెం వద్ద సుమారు 30 షాపులకుపైగా బాణసంచా దుకాణాలను ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం వరకు అనుమతులు రాకపోవడంతో ఆందోళన చెందారు. రూ.లక్షలు ఖర్చుపెట్టి బాణసంచా సామగ్రి తెచ్చామని, అనుమతులు లేక ఇబ్బందులు పడుతున్నామని వ్యాపారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. నిబంధనలు పాటించలేదని ఫిర్యాదులు రావడం వల్ల అనుమతులు ఆలస్యమైనట్లు మరి కొంతమంది వ్యాపారస్తులు చెబుతున్నారు. ఎట్టకేలకు ఆదివారం సాయంత్రానికి అనుమతులు వచ్చాయి. వాతావరణం అనుకూలించకపోవడంతో వ్యాపారాలు ఎలాసాగుతాయోనని ఆందోళనలో ఉన్నారు. సోమవారం కూడా వాతావరణం అనుకూలించకపోతే దివాళా తీస్తామని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ధరలు కూడా పెరిగాయని కొనుగోలుదారులు వాపోతున్నారు.

మురళీధర్‌కు అప్సా ఐకాన్ అకాడమీ అచీవర్ అవార్డు

ప్రజాశక్తి-మాధవధార : ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (అప్సా) ఐకాన్ అకాడమీ అచీవర్ అవార్డును మాధవధారలోని మురళీ మాధవ విద్యాలయం ప్రతినిధి సనపల మురళీధర్ అందుకున్నారు. శ్రీకాకుళంలో జరిగిన సక్సెస్ మీట్‌లో మురళీధర్‌ను సత్కరించారు. అసోసియేషన్ ద్వారా ప్రైవేట్ పాఠశాలల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంలో చేసిన కృషికి ఈ అవార్డు ఇచ్చారు. ఈ సందర్భంగా మురళీధర్ మాట్లాడుతూ, ఈ అవార్డును అందుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు సుందర రామయ్య, రాష్ట్ర అధ్యక్షులు రాజు, విశాఖ జిల్లా అధ్యక్షులు రామకృష్ణ, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



అవార్డును అందుకుంటున్న సనపల మురళీధర్

అంధ విద్యార్థికి అడ్వాన్స్ టెక్నాలజీ కళ్లద్దాలు



అంధ విద్యార్థికి అడ్వాన్స్ టెక్నాలజీ కళ్లద్దాలు అందిస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

ప్రజాశక్తి- ఉక్కునగరం

బీకాం చేసి సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్న అంధ విద్యార్థి రూపస్ పాల్‌కు అక్కిరెడ్డిపాలెంలోని పంచవటి లే-అవుట్‌లో రోటరీ క్లబ్ విశాఖ స్మార్ట్ సిటీ ఆధ్వర్యాన అడ్వాన్స్ టెక్నాలజీ కళ్లద్దాలను అందించారు. వాటి విలువ రూ.75 వేలు అని బహుకరించిన జిల్లా గవర్నర్ డాక్టర్ కల్యాణ్, అసిస్టెంట్ గవర్నర్ ముషిత్రి, క్లబ్ మెంబర్ సెక్రటరీ అల్తాఫ్, ట్రెజరర్ రామ్మోహన్, సెక్రటరీ బోయిన రవీంద్రరావు, ప్రెసిడెంట్ వేణు, స్పందన ఫౌండేషన్ ప్రతినిధి సీతారామరాజు తెలిపారు.

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు

ప్రజాశక్తి- వేపగుంట : సింహాచలంలోని శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామిని ఆదివారం పలువురు ప్రముఖులు వేర్వేరుగా దర్శించుకున్నారు. ప్రముఖ యువ హీరో ప్రదీప్ రంగనాథన్ తన కొత్త చిత్రం 'డ్యూడ్' ప్రమోషన్ విశాఖపట్నానికి విచ్చేసిన సందర్భంగా ఆదివారం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్నారు. విజయనగరం డిఆర్‌ఒ ఎస్.శ్రీనివాసమూర్తి, ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ కూడా దర్శించుకున్నారు. వీరికి ఆలయ పర్యవేక్షణాధికారి బి.సత్యశ్రీనివాస్ స్వాగతం పలికారు. వీరు ముందుగా కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అనంతరం స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి, ప్రసాదాలను అందజేశారు.

టిడ్కో ఇళ్లు కేటాయించాలి

ప్రజాశక్తి - ఉక్కునగరం : టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు త్వరితగతిన కేటాయించాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ డిమాండ్ చేశారు. జివిఎంసి 88వ వార్డు పరిధి మంగళపాలెం గృహ సముదాయంలో టిడ్కో గృహ లబ్ధిదారులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ, టిడ్కో గృహాలు నిర్మించి 10 ఏళ్లు గడిచినప్పటికీ లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించక పోవడం సరైంది కాదన్నారు. కనీస మౌలిక సౌకర్యాలు కల్పించలేదని, విద్యుత్, మంచి నీరు, డ్రైనేజీ వ్యవస్థ మెరుగు పరచాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. తక్షణమే టిడ్కో ప్రాజెక్ట్ అధికారులు స్పందించి మౌలిక సౌకర్యాలు పూర్తి చేసి లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు జి.ఆనంద్, టిడ్కో గృహ లబ్ధిదారులు ఆర్.శ్రీనివాసరావు, ఎ.గోపి పాల్గొన్నారు.

నిర్బంధంపై పోలీసుల ద్వంద్వ వైఖరి



సిపిఎం నేత అప్పలరాజు ఇంటి వద్ద పోలీసుల పహారా

ప్రజాశక్తి -ఎస్ రాయవరం : గృహనిర్బంధంపై పోలీసుల మాటలకు, చేతలకు పొంతన లేదని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు విమర్శించారు. ఆదివారం రాజయ్యపేటకు జిల్లా కలెక్టర్ వస్తారని శనివారం రాత్రి నుండి మండలంలోని ధర్మవరం అగ్రహారం గ్రామంలో తన ఇంటి వద్ద బయటకు వెళ్ళకుండా పోలీసుల పహారా ఏర్పాటు చేయడాన్ని ఖండించారు. ఈసందర్భంగా ఆదివారం ఉదయం అప్పలరాజు మాట్లాడుతూ, ఒకవైపు నర్సీపట్నం డిఎస్పి నిర్బంధం లేదని ప్రకటిస్తుంటే మరోవైపు తాను బయటకు వెళ్లకుండా తన ఇంటి వద్ద రేయింబవళ్లు పోలీసుల పహారా ఏంటని ప్రశ్నించారు. పోలీసులు, ప్రభుత్వం ఎంత నిర్బంధం ప్రయోగించినా, బల్క్‌డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా మత్స్యకారులకు అండగా పోరాటం కొనసాగుతుందని అప్పలరాజు స్పష్టం చేశారు.

జాతీయ సెపక్‌తక్రా పోటీలకు శ్వేతాశ్రీ



శ్వేతాశ్రీని అభినందిస్తున్న కాలేజీ చైర్మన్, ప్రిన్సిపల్

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని లగిశెట్టిపాలెం, గాలిభీమవరంలోని ఆర్యభట్ట పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థిని నునబర్తి శ్వేతాశ్రీ జాతీయస్థాయి జూనియర్ సెపక్‌తక్రా పోటీలకు ఎంపికైనటన్లు కళాశాల ప్రిన్సిపాల్ సుధీర్‌బాబు తెలిపారు. ఈనెల 11,12తేదీల్లో బాపట్ల జిల్లా చీరాల డిఎస్ఎ ఇండోర్ స్టేడియంలో జరిగిన 29వ ఎపి జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఛాంపియన్ షిప్ పోటీల్లో అనకాపల్లి జట్టు తరపున పాల్గొన్న శ్వేతాశ్రీ అద్భుతమైన ప్రతిభతో జాతీయజట్టుకు ఎంపికైంది. ఈ నెల 27 నుంచి డిసెంబర్ 2వరకు పంజాబ్‌లో జరగనున్న జాతీయస్థాయిలో పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున శ్రేతాశ్రీ పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా శ్వేతాశ్రీని కళాశాల చైర్మన్ సి హెచ్ మహంధాత నాయుడు, ప్రిన్సిపాల్ సుదీర్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ నరేష్, పీడీ ప్రవీణ్ అభినందించారు.

భూలోకమాంబ ఉత్సవాలకు సర్వం సిద్ధం



ఉత్సవాలకు ఏర్పాటుచేసిన స్వాగత ద్వారం

ప్రజాశక్తి - యలమంచిలి : పట్టణంలో ఏటా దీపావళి నుండి నాగుల చవితి వరకు ఆనవాయితీగా నిర్వహించే భూలోక మాంబ పంచ రాత్రుల ఉత్సవాలకు సర్వం సిద్ధమైందని ఆలయ ధర్మకర్త, ఉత్సవ కమిటీ చైర్మన్, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనందకుమార్ తెలిపారు. సోమవారం ఉదయం 10.40 గంటలకు ఉత్సవాలు ప్రారంభమై ఐదు రోజులపాటు జరుగుతాయన్నారు. ఉత్సవాల నేపథ్యంలో పట్టణంలోని తులసీనగర్‌లో విద్యుత్ లైటింగ్‌లు, సెట్టింగులతో దేదీప్యమానంగా అలంకరించారు. సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నారు. సోమవారం ప్రారంభ వేడుకలో గ్రామ పెద్దలతో పాటు ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, అనకాపల్లి ఎంపి సిఎం రమేష్, బిజెపి రాష్ట్రఅధ్యక్షులు పివిఎస్ మాధవన్, స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి పాల్గొంటారని ఆనందకుమార్ తెలిపారు.

ఆశావర్కర్ల రాష్ట్ర మహాసభ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యూనియన్ నేతలు

ప్రజాశక్తి-. అనకాపల్లి : వచ్చేనెల 8 9 తేదీల్లో అనకాపల్లిలో నిర్వహించే ఆశావర్కర్ల యూనియన్ ఐదవ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ం ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో ఆశా వర్కర్స్ రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ మహాసభలకు 26 జిల్లాల నుండి 300 మంది ఆశాలు హాజరవుతారన్నారు. మహాసభలో రాష్ట్రవ్యాప్తంగా కార్యకర్తల సమస్యలపై చర్చించి భవిష్యత్తు పోరాటాలకు దిశా నిర్దేశం చేస్తారన్నారు. ప్రజలకు పలు రకాల వైద్య సేవలందిస్తున్న ఆశా కార్యకర్తలకు కనీస వేతనాలు అమలు కావడం లేదన్నారు. ఐదేళ్లుగా వేతనాలు పెరగక, వచ్చిన అరకొర వేతనాలతో కుటుంబాలను నెట్టుకురాలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. జనాభాకు అనుగుణంగా ఆశా కార్యకర్తలను పెంచాలని, రాజకీయ జోక్యాన్ని అరికట్టాలని, ఆశా వర్కర్లకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.శాంతి, ప్రధాన కార్యదర్శి వి సత్యవతి, కోశాధికారి ఈ పార్వతి, జిల్లా కార్యవర్గ సభ్యురాలు ఎం సూర్య కళ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ శంకరరావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జిల్లా స్థాయి యోగా పోటీలు



యోగాలో ప్రతిభ చూపిన కృష్ణా యోగా సెంటర్ అభ్యాసకులు

ప్రజాశక్తి -చోడవరం : పట్టణంలోని పతంజలి యోగ శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో ఉషోదయ విద్యాసంస్థల ప్రాంగణంలో జిల్లాస్థాయి యోగా పోటీలు ఉత్సాహంగా సాగాయి. పోటీలో 150 మంది పాల్గొనగా, వారిలో 48 మంది ఈనెల 25 26 తేదీల్లో విశాఖపట్నం జరగబోయే రాష్ట్ర యోగ పోటీలకు ఎంపికైనట్లు రాష్ట్ర యోగా అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ పుల్లేటి సతీష్ తెలిపారు.
పోటీలను పతంజలి యోగా శిక్షణ కేంద్రం చైర్మన్ పసుమర్తి అశోక్ ప్రారంభించగా, విజేతలకు ఉషోదయ విద్యాసంస్థల చైర్మన్ జెర్రిపోతుల రమణాజీ బహుమతులు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ అనిల్ గనిరెడ్డి రమణమూర్తి రమేష్ మాస్టర్ యోగ టీచర్స్ బోగవెల్లి గణేష్, రవితేజ, ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా బర్నికాల మోహన్ కుమార్, కొట్టాపు హరి కిరణ్, పుల్లేటి గణేష్ పాల్గొన్నారు.

శ్రీకృష్ణ యోగా సెంటర్ విద్యార్థుల ప్రతిభ

అనకాపల్లి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యోగ అసోసియేషన్ అనుబంధ సంస్థ చోడవరం పతంజలి యోగ చారిటబుల్ ట్రస్ట్ అండ్ ట్రైనింగ్ సెంటర్ ఆధ్వర్యంలో అనకాపల్లి జిల్లా యోగా కాంపిటీషన్ పోటీలను ఆదివారం చోడవరం ఉషోదయ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్‌లో నిర్వహించారు. ఈ పోటీలకు తుమ్మపాల శ్రీకృష్ణ యోగ సెంటర్ నుంచి 21 మంది హాజరు కాగా 13 మంది వివిధ కేటగిరీలో బహుమతులు గెలుచుకున్నారు. వీరిలో 60 సంవత్సరాల కేటగిరీలో ప్రథమ స్థానం పొందిన బుదిరెడ్డి నరసింగరావు, 50 నుంచి 60 సంవత్సరాల కేటగిరీలో ద్వితీయ స్థానం పొందిన ఏ ఇందిరా దేవి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. యోగాలో ప్రతిభ చూపిన వారిని తుమ్మపాల గ్రామ పెద్దలు కర్రీ బాబి, జోగి నాయుడు, నడిపల్లి గణేష్, బోసు బాబు, అజయ్, పల్లేల గణేష్, చంటి, గొంతిన వెంకట్రావు, బుదిరెడ్డి సూరిబాబు, గొంతిన శ్రీను, ఆర్టీసీ సత్యనారాయణ అభినందించారు.

పల్లె పండగ రోడ్లకు బిల్లుల గండం

- ఏడాదిగా నిలిచిన చెల్లింపులు
- జిల్లాలో రూ.132 కోట్ల మేర బకాయిలు
- సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకన్న



సగంలోనే ఆగిపోవడంతో బురదకూపంగా మారిన రోడ్డు

ప్రజాశక్తి- దేవరాపల్లి : ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవతో పల్లెపండుగలో చేపట్టిన పలు రహదారి పనులకు ఏడాదిగా బిల్లులు చెల్లించకపోవడంతో నిర్మాణాలన్నీ అర్ధాంతరంగా నిలిచిపోయాయని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి వెంకన్న ఆరోపించారు. ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ, వాలాబు పంచాయతీ పూల గరువు, రామన్న పాలెం, బుచ్చంపాలెం, బొడ్డగుమ్మి, కోనాం కోడాపల్లి, బొర్ర చింత, తుమ్మలపాలెం గ్రామాలకు రూ. 12 కోట్లుతో రోడ్లు మంజూరు చేసి పనులు చేపట్టగా, కేవలం రూ.1.70కోట్ల నిధులు మంజూరు చేయడంతో ఆయా పనులన్నీ ఎక్కడికక్కడే అసంపూర్తిగా నిలిపోయాయని అగ్రహం వ్యక్తం చేశారు కూటమి ప్రభుత్వ అసమర్థత వల్లే అరకొరగా నిలిచిన పనులన్నీ ప్రజలకు నరకాన్ని చూపిస్తున్నాయని మండిపడ్డారు. వీర బద్రిపేటకు రూ.84 లక్షలతో చేపట్టిన బిటి రోడ్డు ఎర్త్ వర్క్‌తో నిలిచిపోయిందని, నేరెళ్ళపూడి, బోడి గరువు మదన గరువు గ్రామాలకు రూ.1,90 కోట్లుతో చేపట్టిన రోడ్లు ముందుకు కదలడం లేదన్నారు. అసంపూర్తిగా నిలిచిన రోడ్లన్నీ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు బురద కూపాలుగా మారి ప్రజలను అవస్థలకు గురిచేస్తున్నాయన్నారు. జిల్లాలో పల్లెపండుగలో రూ.143 కోట్లతో పనులు చేస్తే రూ.11 కోట్లు మాత్రమే విడుదల చేశారని, రూ.132కోట్ల బకాయిలు ఉన్నాయన్నారు..ఉపాధి హామీ పథకంలో మెటీరియల్ కాంపోనెంట్ కింద గడిచిన ఫిబ్రవరి 15నాటికి జిల్లాలో 166 కిలోమీటర్ల పొడవైన 1,354 రోడ్డు నిర్మాణాలు పూర్తయి బిల్లులు అప్‌లోడ్ చేసినా, మార్చినెలాఖరుకు ఇవ్వాల్సిన బిల్లులు నేటికీ చెల్లించలేదని మండిపడ్డారు. ఆయా పనులకు వెంటనే నిధులు విడుదల చేసి, అసంపూర్తి రోడ్లన్నీ పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని వెంకన్న కోరారు

జిఎస్‌టి తగ్గింపుతో మేలు



ప్రదర్శనను ప్రారంభిస్తున్న జెసి జాహ్నవి, పక్కనే ఎమ్మెల్యే కొణతాల

ప్రజాశక్తి-అనకాపల్లి : జిఎస్‌టి 2.0 తగ్గింపు ధరలతో పేదమధ్యతరగతి ప్రజలతోపాటు వ్యాపారులకు ప్రయోజనం చేకూరుతుందని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ మేడిద జాహ్నవి అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాలతో పట్టణంలోని మెయిన్ రోడ్‌లో జివిఎంసి ఆధ్వర్యంలో వాణిజ్య ప్రచార అవగాహనకు ఏర్పాటు చేసిన ప్రదర్శన, కొనుగోలు స్టాళ్లను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొణతాల మాట్లాడుతూ, జిఎస్‌టి 2.0తో ప్రధాని మోడీ నేతృత్వంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకుని వచ్చి పేద,మధ్య తరగతి, అన్ని వర్గా ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ధరలను గణనీయంగా తగ్గించాలన్నారు.కార్యక్రమంలో ఆర్‌డివో షేక్ ఆయిషా, జివిఎంసి కమిషనర్, అనకాపల్లి జోనల్ కమిషనర్ చక్రవర్తి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కల్యాణ మండపం ప్రారంభం



కల్యాణ మండపాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజు

ప్రజాశక్తి చోడవరం : విశాఖ డెయిరీ నిధులతో నరసాపురం గ్రామంలో నిర్మించిన తులసి కల్యాణ మండపాన్ని స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు, డెయిరీ డైరెక్టర్ ఎలమంచిలి మున్సిపాలిటీ చైర్మన్ రమాదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రజల సామాజిక అవసరాలను గుర్తించి గ్రామాల్లో కల్యాణమండపాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు భవిష్యత్‌లో అన్ని గ్రామాల్లో వీటిని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో. రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ నాగగంగాధర్, డెయిరీ డైరెక్టర్లు దాడి పవన్‌కుమార్, గేదెల సత్యనారాయణ, శీరం రెడ్డి సూర్యనారాయణ, మాజీ ఎంపీపీ జి సత్యనారాయణ, టిడిపి మండల అధ్యక్షుడు కరిశెట్టి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

కోనేరు నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలోని పి.భీమవరం రోడ్‌లో గల శివాలయం వద్ద కోనేరు నిర్మాణపనులను చోడవరం ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు ఆదివారం పరిశీలించారు. కోనేటి వద్ద అవసరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, డొంకిన అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ తామరాన దాసు, వేపాడ మధు పాల్గొన్నారు.

వృద్ధాప్య సమస్యలపై అప్రమత్తత

ప్రజాశక్తి- అనకాపల్లి : వృద్ధాప్య సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ హోమియో వైద్యులు నాగరాజు కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో అనకాపల్లి వాకర్స్ క్లబ్ సర్వసభ్య సమావేశంలో వృద్ధాప్యంలో వచ్చే సమస్యలు, వాటి పరిష్కారచర్యలపై డాక్టర్ నాగరాజు వివరించారు.
సయాటికా, రక్తపోటు, నిద్రలేమి, మధుమేహం తదితర విషయాలపై వివరిచారు. ప్రతిరోజూ నడక, వ్యాయామం, యోగా, ప్రాణాయామం చేయాలన్నారు. హోమియో వైద్యం నెమ్మదిగా పనిచేస్తున్నా, శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు అనంతరం కొత్తగా చేరిన వాకర్స్ కు వాకర్స్ పిన్ ప్రదానం చేశారు.డాక్టర్ నాగరాజు జ్ఞాపిక, దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో అధ్యక్షులు రాపేటి నారాయణరావు, కార్యదర్శి యల్లపు శివ, కోశాధికారి కెవివి సత్యనారాయణ, డాక్టర్ డిడి నాయుడు, ఆడారి మల్లికార్జునరావు, దాడి స్వామినాయుడు, బేతా సత్యసాయి, భీశెట్టి రామకృష్ణ పాల్గొన్నారు.

రైవాడ జలాశయ నీటి విడుదల



జలాశయం స్పిల్‌వే గేట్ల నుంచి బయటకు వెళ్తున్న నీరు

ప్రజాశక్తి- దేవరాపల్లి : ఎగువ పరివాహక ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు రైవాడ జలాశయంలోని భారీగా నీరు వచ్చి చేరుతున్న నేపథ్యంలో ఆదివారం సాయంత్రం నుంచి నాలుగు వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసినట్లు రిజర్వాయర్ డిఇఇ సత్యంనాయుడు తెలిపారు. రిజర్వాయర్ క్యాచ్‌మెంట్ ఏరియా ఎగువ అనంతగిరి ప్రాంతంలో కురిసిన అధిక వర్షంతో రైవాడ జలాశయానికి భారీగా నీరు వచ్చి చేరిందన్నారు రిజర్వాయర్ గరిష్టనీటి మట్టం 114.00మీ, కాగా, ప్రస్తుతం 113.83 మీటర్లకు చేరుకోవడంతోపాటు, ఇన్‌ఫ్లో మూడు వేల క్యూసెక్కులు నీరు రిజర్వాయర్‌లోకి వచ్చి చేరుతుండడంతో ముందు జాగ్రత్తగా జలాశయం స్పిల్ వే ద్వారా మూడు గేట్లు తెరచి నాలుగు వేల క్యూసెక్కులు నీటిని జలాశయం నుండి శారదా నదిలోకి విడిచిపెట్టినట్లు తెలిపారు. జలాశయం దిగువన, శారదానదీ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

వర్షంతో వరి పైర్లకు మేలు

ప్రజాశక్తి -అచ్యుతాపురం : అల్పపీడన ప్రభావంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు వరిపైర్లకు లాభదాయకంగా ఉంటాయని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాలువల ద్వారా నీరు చేరుతున్నప్పటికీ, వరిపైర్లపై పైనుంచి వర్షపు జల్లులు పడడం వల్ల అవి చేను పైభాగం నుంచి పిలకల్లోకి చేరి ప్రయోజనం

సేంద్రీయ పాల ఉత్పత్తుల ప్రదర్శన



పాల ఉత్పత్తులను ప్రదర్శిస్తున్న జనమైత్రి ప్రతినిధులు

ప్రజాశక్తి- అచ్యుతాపురం : మండలంలోని తిమ్మరాజుపేట జంక్షన్‌లో దీపావళి పండగ సందర్భంగా ఆదివారం నాబార్డ్ సౌజన్యంతో స్వచ్ఛమైన ఆర్గానిక్ పాలఉత్పత్తులను జన మైత్రి పాల ఉత్పత్తి సంస్థ ఆధ్వర్యంలో ప్రజలకు పరిచయం చేశారు. జన మిత్ర, ఎన్ వై ఎస్ స్వచ్ఛంద సంస్థల సహకారంతో కెమికల్స్ లేని స్వచ్ఛమైన పాలతో తయారుచేసిన బాదం మిల్క్, నెయ్యి, పన్నీరు, తదితర పాల ఉత్పత్తులను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఐఆర్‌వి అప్పారావు ఎం.ప్రసాద్, ఎస్.గణేశ్వరరావు జి అప్పారావు, ఎలమంచిలి లక్ష్మి పాల్గొన్నారు.

పేదలకు బట్టలు, బాణసంచా పంపిణీ

ప్రజాశక్తి- అనకాపల్లి : సిద్ధార్థ సోషల్ సర్వీస్, కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు బల్ల నాగభూషణం ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని నిరుపేదలకు బట్టలు, దీపావళి సామాన్లు, కళ్లద్దాలు, మిఠాయిలు పంపిణీ చేశారు. స్థానిక చినరాజుపేట చౌడేశ్వరి సాంబశివ దేవాలయం ఆవరణలో నరకచతుర్దశి , ముందస్తు దీపావళి వేడుకలను నిర్వహించారు. వరలక్ష్మి దేవి చిత్రపటానికి సంస్థ అధ్యక్షులు పూజలు నిర్వహించారు కార్యక్రమములో అసోసియేషన్ కార్యదర్శి వినకోట నీలేషగుప్తా, కార్యవర్గ సభ్యులు బొడ్డు సోమరాజు, అయ్యగారు వెంకటరమణమూర్తి,బూడిద జోగారావు,, దేవాలయ అర్చకులు గంటిరామనాధ శాస్త్రి, సచివాలయఉద్యోగి పద్మ పాల్గొన్నారు.



పేదలకు బాణసంచా, స్వీట్లు ఇస్తున్న సిద్ధార్ధ అసోసియేషన్ ప్రతినిధులు

కిడ్నీ వ్యాధిగ్రస్తులకు రెండో విడత స్క్రీనింగ్

ప్రజాశక్తి- అనకాపల్లి : కిడ్నీ వ్యాధులు ప్రబలిన గ్రామాల్లో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆదేశాల మేరకు రెండోవిడతగా మూడురోజులపాటు ప్రత్యేక మెడికల్ స్క్రీనింగ్ నిర్వహించినట్లు ఆసుపత్రి డైరెక్టర్ ఆళ్ళ రామచంద్రరావు తెలిపారు. అనకాపల్లి ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రిలో నెఫ్రాలజీ వైద్యుల బృందం ఆయా గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించి పరీక్షల్లో 45మంది కిడ్నీ వ్యాధికి గురైనట్లు గుర్తించి మందులను పంపిణీ చేశారు. మందులతో వ్యాధి నివారణ కాని తీవ్రస్థితిలో ఉన్న వారిని డయాలసిస్‌కు రిఫర్ చేశారు.

కాగా ఎమ్మెల్యే కొణతాల ఆదేశాలతో మొదట విడతగా మాటూరు, మాకవరం, మామిడిపాలెం, ఊడేరు, సంపత్ పురం, వేట జంగాల పాలెం, చింతనిప్పుల అగ్రహారం, సుందరయ్య పేట మూడు గ్రామాలు, కుంచంగి రొంగలివానిపాలెం గ్రామాల్లో స్క్రీనింగ్ నిర్వహించిన విషయం తెలిసిందే 11 గ్రామాలకు చెందిన వారికి స్క్రీనింగ్ నిర్వహించి, 2670 శాంపిల్స్ సేకరించారు. కార్యక్రమంలో డిసిహెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాసరావు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణారావు, డాక్టర్ సబీనా, డయాలసిస్ యూనిట్ ఇన్‌ఛార్జి వీర్రాజు, అభివృద్ధి కమిటీ సభ్యులు డాక్టర్ డిడి నాయుడు, గొర్లి శేఖర్, ఉల్లింగల రమేష్, రొంగలి రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.



ఆరోగ్య పరీక్షలు చేస్తున్న నెఫ్రాలజీ వైద్యబృందం

విద్యార్థి దశలోనే లక్ష్యాలను నిర్దేశించుకోవాలి



మాట్లాడుతున్న డాక్టర్ బండారు

ప్రజాశక్తి -కె.కోటపాడు: హైస్కూలు స్థాయిలోనే విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు పట్టుదలతో కృషి చేయాలని ఇఎన్‌టి వైద్య నిపుణులు ప్రొఫెసర్ డాక్టర్ బండారు రామచంద్రరావు అన్నారు. ఆదివారం గొండుపాలెంలో సంఘమిత్ర రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో గ్రామీణ విద్యాజ్యోతి కింద ఈ ఏడాది ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందించారు. సొసైటీ కార్యదర్శి బొంతు మంగపతిరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ బండారు మాట్లాడుతూ, ప్రతి విద్యార్థీ క్రమశిక్షణ నిజాయితీ పట్టుదలతో కష్టబడితే సమాజానికి దిశానిర్దేశం చేసే ఉన్నత స్థాయికి చేరుకుంటారన్నారు సమావేశంలో పద్మ పూజిత ఫైనాన్స్ ఎండి బసవరాజు మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో ప్రజలకు విద్యా, ఆరోగ్యం అందించే లక్ష్యంతో సంఘమిత్ర సొసైటీ చేస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. అనంతరం రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులు లెక్కల నారాయణమూర్తి, జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులు మండల మురళీకృష్ణ, బొడ్డు అప్పల నాయుడు, కొండ్రపు దండు నాయుడు, దేవుడు బాబులను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కె. కోటపాడు, దేవరాపల్లి మండలాల్లో ఉత్తమప్రతిభ కనబరిచిన 33 మంది విద్యార్థులకు విద్యాజ్యోతి సర్టిఫికెట్లను, నగదు పురస్కారాలను విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో అందించారు. చోడవరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ గండి గోవిందనాయుడు పాల్గొన్నారు.

నిబద్ధతతో రాజకీయాలు చేస్తా

ప్రజాశక్తి - యలమంచిలి: నిబద్ధత గల నాయకుడిగా వైసిపిలో కొనసాగుతూ రాజకీయాలు కొనసాగిస్తానని మాజీ ఎంపిపి బోదెపు గోవిందరావు స్పష్టం చేశారు. ఆదివారం ఎలమంచిలిలో పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ, పార్టీ మూలంగానే వ్యక్తులకు గుర్తింపు లభిస్తుందని, అలాంటి పార్టీకి వెన్నుపోటు పొడిచి రాజకీయంగా పైకి ఎదగాలనుకోవడం సరికాదన్నారు. రాజాన శేషగిరిరావుతో తనకు ఎటువంటి వ్యక్తిగత విభేదాలు లేవని, . ఆయన తన రాజకీయ భవిష్యత్తుకు పునాదులు వేసుకుంటున్నారన్నారు అయితే వైసిపి . కాకపోతే వైస్‌ఆర్‌సిపి మద్దతుతో ఎంపిటీసిగా గెలిపి, అదే పార్టీ మెజార్టీ తగ్గించి ఎంపిపిగా ఎదగాలనుకోవడం చట్టప్రకారం చెల్లుబాటైనా, ఇటువంటి అనైతిక చర్యలకు ప్రజల ఆమోదం లభించదన్నారు. తనకు. పదవి ఉన్నా లేకున్నా ప్రజాక్షేత్రంలో పార్టీ కోసం పాటుపడతానన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి ఎర్రయ్యదొర, మున్సిపల్ వైస్‌చైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, ఆరెపు ఉప్పా, జెడ్‌పిటిసి సంధ్యారాము, లైన్‌కొత్తూరు సర్పంచ్ కొల్లి త్రినాథ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎంపిపి బోదెపు గోవిందరావు

బెల్లం తయారీ ప్రారంభం



బెల్లం తయారు చేస్తున్న రైతు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలోని విజయరామరాజుపేటలో బెల్లం తయారీ ప్రారంభించారు. గోవాడ సుగర్స్ క్రషింగ్‌పై స్పష్టత లేకపోవడం, గతేడాది సరఫరా చేసిన చెరకు సంబంధించి బిల్లులు పెండింగ్‌లో ఉండడంతోపాటు చెరకుసాగుకు పెట్టుబడి వ్యయం పెరిగి, దిగుబడి గణనీయంగా తగ్గడం వంటి కారణాలతో గిట్టుబాటుకాని పరిస్థితుల్లో అనేక గ్రామాల్లో చెరకు సాగును గణనీయంగా తగ్గించారు. గతంతో పోలిస్తే, సగానికి కంటే ఎక్కువ విస్తీర్ణంలోనే చెరకు సాగు తగ్గిపోయించి, అయితే వేసిన చెరకు చేతికి అందిరావడంతో పలుగ్రామాల్లో బెల్లం తయారీకి రైతులకు పూనుకున్నారు. గోవాడ చక్కెర కర్మాగారానికి చెరకు సరఫరాలో నెలకొన్న సందిగ్ధతలో మండలంలోని పలు గ్రామాల్లో బెల్లం తయారీకి రైతులు సిద్ధమయ్యారు. మండలంలో అతి ఎక్కువగా బెల్లం తయారు చేసే గ్రామాల్లో ఒకటైన విజయరామరాజు పేటలో గతంలో 20 వరకు క్రషర్లు ఉండగా,ఈ ఏడాది తక్కువ మంది రైతులు చెరకు సాగుచేసినా, వారంతా బెల్లం తయారీకి ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

'రాచ పీనుగు' కథకు ప్రథమ బహుమతి

ప్రజాశక్తి - కశింకోట : జాగృతి వారపత్రిక నిర్వహించిన దీపావళి కథల పోటీల్లో కశింకోట గ్రామానికి చెందిన బొడ్డేడ బలరామస్వామి రాసిన రాచ పీనుగు చారిత్రక కథ ప్రథమ బహుమతికి ఎంపికైంది. త్వరలో హైదరాబాదులో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో ప్రథమ బహుమతి విజేత బలరామస్వామికి రూ.12వేల నగదు, జ్ఞాపక అందజేస్తామని పత్రిక నిర్వాహకులు ఆదివారం వెల్లడించారు. బొడ్డేడ బలరామస్వామి ఇప్పటివరకూ రాసిన 34 కథలు, కొన్ని కవితలు రాయగా, అవి. వివిధ పత్రికలలోనూ, సంకలనాలలోనూ ప్రచురితమయ్యాయి. చతుర నవంబరు 2018 సంచికలో ఈయన రాసిన ఆకుపచ్చని చంద్రుడు నవల అచ్చయ్యింది. సముద్రం కథకు 2017లో స్వాతి మాస పత్రిక నుంచి అనిల్ అవార్డు అందుకున్నారు. అనకాపల్లి గౌరీ గ్రంథాలయం, నిర్వహించిన కథలపోటీలో మొదటిసారిగా ఆడపిల్ల కథకు ద్వితీయ బహుమతిని డాక్టర్. సి. నారాయణరెడ్డి నుంచి అందుకున్నారు. నమస్తే తెలంగాణ - ముల్కనూరు సాహితీ పీఠం నిర్వహించిన కథలపోటీలలో-2021లో కీడు గుడిసె కథకు ప్రత్యేక బహుమతి, 2023-24లో డేగ కథకూ, 2025లో తోడపెద్దు కథకూ తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. కళింగ పౌరుషం చారిత్రక కథకు జాగృతి వార పత్రిక నుంచి ప్రోత్సాహక బహుమతి, పట్టుచీర కథకు హాస్యానందం పత్రిక నుంచి ప్రత్యేక బహుమతి దక్కించుకున్నారు. పలు కథలు పోటీల్లో బహుమతులు దక్కించుకుంటున్న బలరామస్వామిని పలువురు సాహితీవేత్తలు, గ్రామ పెద్దలు అభినందించారు.

21 నుంచి డివిజన్ స్థాయి ఆటల పోటీలు

ప్రజాశక్తి- అనకాపల్లి / అనకాపల్లి రూరల్ : జిల్లాస్థాయి క్రీడాకారుల ఎంపికకు ఈనెల 21 నుంచి జివిఎంసి ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో డివిజనల్ స్థాయి క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బ్రహ్మాజీ, వ్యాయామ ఉపాధ్యాయుడు, డివిజనల్ కోఆర్డినేటర్ ఎస్‌వి నరసింహం తెలిపారు అనకాపల్లి డివిజన్ పరిధిలోని12 మండలాలకు చెందిన వివిధ పాఠశాలల విద్యార్థులకు వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్, యోగ, చెస్, అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించి, ప్రతిభ చూపిన బాలబాలికలను జిల్లా జట్టుకు ఎంపిక చేస్తారన్నారు.

ప్రభుత్వ స్పందనపై హర్షం

ప్రజాశక్తి- చోడవరం : తమ డిమాండ్లపై ప్రభుత్వ సానుకూలంగా స్పందించడం శుభ పరిణామమని ఎపి నాన్ గజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ విశాఖ ఉమ్మడి జిల్లా కార్యదర్శి ఆర్ రవిశంకర్ ఆదివారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న డిఎ విడుదల, నెలరోజుల్లో హెల్త్ కార్డుల సమస్యలు పరిష్కారం, మెమో 59పై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించడం హర్షణీయమన్నారు. ప్రభుత్వ చర్చల్లో పాల్గొని, ఫలవంతం చేసిన జెఎసి నేత విద్యాసాగర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు మధ్యలో స్తంభాన్ని మారుస్తాం

ప్రజాశక్తి -అచ్యుతాపురం : తమ్మయ్య పేటకు వెళ్లే రహదారి మధ్యన ఉన్న విద్యుత్ స్తంభాన్ని మారుస్తామని అచ్యుతాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ ఎఇఇ ఎం శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు గ్రామపంచాయతీ కార్యదర్శిని కలిసి రోడ్డు మధ్యలో ఉన్న స్తంభం మార్పుపై తీర్మానం అడిగినట్లు తెలిపారు. వాహనాల రాకపోకలకు సమస్య లేకుండా త్వరలో రహదారి మధ్యలో ఉన్న స్తంభాన్ని మార్పుచేస్తామన్నారు.

శ్రీశ్రీ కళావేదిక కార్యనిర్వాహక కార్యదర్శిగా శాస్త్రి



జిఎల్ఎన్.శాస్త్రి

ప్రజాశక్తి-.అనకాపల్లి : అనకాపల్లికి చెందిన జిఎల్ఎన్. శాస్త్రి శ్రీశ్రీ కళావేదిక కార్యనిర్వహణ కార్యదర్శి గా నియమితులయ్యారు. మంచి కవి,సాహితీవేత్త మాత్రమే కాకుండా, ఉపాధ్యాయుడు, సృజనాత్మక ఆలోచనలతో సంపన్నమైన వ్యక్తిత్వం కలిగిన వ్యక్తి. తెలుగు సాహిత్యంలో శాస్త్రి రచనలు మానవీయత, భావోద్వేగం, జ్ఞానప్రవాహం కలిగిన రత్నాలుగా వెలుగొందుతున్నాయి. ఆయన సాహిత్య ప్రావీణ్యం, రచన శైలి, వాక్పటుత్వం శ్రీశ్రీ కళావేదికను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తుందని కళావేదిక బృందం అభినందనలు తెలిపారు. శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ కత్తిమండ ప్రతాప్ మార్గనిర్దేశకత్వంలో ఈ నియామకం జరిగింది.

పోలీసుల వలయంలో రాజయ్యపేట



పోలీస్ బలగాలపై సిఐతో మాట్లాడుతున్న మత్స్యకారులు

- బయట వ్యక్తులకు నో పర్మిషన్
- లోకల్ అయితే ఆధార్ చూపించాల్సిందే..
- మత్స్యకారుల కదలికపై నిరంతరం నిఘా



రాజయ్యపేట ప్రాంతంలో పోలీస్ పికెట్

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటను పోలీసులు ఆధీనంలో తీసుకున్నారు. రాజయ్యపేట వెళ్లే మార్గాలన్నీ పోలీసులు తమ కంట్రోల్లో పెట్టుకున్నారు. మత్స్యకారుల కదలికపై పోలీసులు నిరంతరం నిఘా పెట్టారు. బల్క్ డ్రగ్ పార్కును వ్యతిరేకిస్తూ మత్స్యకారులు సెప్టెంబర్ 14వ తేదీ నుండి శాంతియుత రిలే దీక్షలను ప్రారంభించారు. టెంటు వేసుకునేందుకు అనుమతి లేదని పోలీసులు ఆంక్షలు విధించినప్పటికీ మత్స్యకారులు ఎక్కడా తగ్గలేదు. తమ ఉనికి, ఉపాధిని దెబ్బతీసే బల్క్ డ్రగ్‌ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని, అప్పటివరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేస్తూ మత్స్యకారులు పోరు బాట పట్టారు. సెప్టెంబర్ 24,25 తేదీల్లో మత్స్యకారుల ఉద్యమాన్ని ఉధృతం చేశారు. హోం మంత్రి వచ్చి సమాధానం చెప్పాలని పట్టుబట్టారు.ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 29 న రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత గ్రామానికి వెళ్లి మత్స్యకారులతో మాట్లాడారు. మత్స్యకారులు ఒక కమిటీగా ఏర్పడితే సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దగ్గరకు తీసుకువెళ్లి మాట్లాడిస్తానని హామీ ఇచ్చి వెనుతిరిగారు. హోం కాన్వాయ్ ను అడ్డుకున్నారు. బల్క్ డ్రగ్ ను రద్దు చేస్తామని స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇది తన చేతుల్లో లేదని, ప్రభుత్వం చేయాల్సిన పని అని, అప్పటివరకు బల్క్ డ్రగ్ పనులు నిలుపుదల చేస్తామని హామీ ఇవ్వడంతో మత్స్యకారులు ఆందోళన విరమించారు. మత్స్యకారులు ఈనెల 12వ తేదీన జాతీయ రహదారిని 4 గంటలపాటు దిగ్బంధించారు. అదే రోజు సాయంత్రం 6 గంటలకు జిల్లా కలెక్టర్ ఆందోళనకారులతో మాట్లాడారు. 15వ తేదీన రాజయ్యపేట వచ్చి గ్రామసభ నిర్వహించి మాట్లాడతానని హామీ ఇవ్వడంతో మత్స్యకారులు శాంతించారు.15వ తేదీన అనివార్య కారణాల వల్ల కలెక్టర్ రాలేకపోయారని, తదుపరి తేదీని తెలియజేస్తామని ఆర్డిఓ వివి రమణ, తహసిల్దార్ నరసింహామూర్తి మత్స్యకారులకు తెలియజేశారు. హోం మంత్రిని అడ్డుకోవడం, హైవే దిగ్బంధం చేయడం వంటి పరిణామాలు దృశ్య ఈ నెల 15వ తేదీ నుండి రాజయ్య పేటను పోలీసులు తమ ఆధీనంలో తీసుకున్నారు. భారీగా పోలీసు బందోబస్తును మోహరించారు. సుమారుగా 800 మంది పైబడి పోలీసు బలగాలను రప్పించి, రాజయ్యపేట వెళ్లే మార్గాలన్నింటిని పోలీసులు తమ కంట్రోల్లో పెట్టుకున్నారు.



ఆధార్‌ను ముద్రించిన టీ షర్ట్‌ను ధరించిన యువకుడు



సిద్ధంగా ఉన్న పోలీస్ వాహనాలు

నక్కపల్లి హైవే జంక్షన్, ఉపమాక, హెటిరో కంపెనీ,బుచ్చి రాజుపేట, బోయపాడు, దొండవాక ప్రాంతాల్లో పోలీస్ పికెట్లు ఏర్పాటు చేసి వచ్చే పోయే వాహనాలను పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. మత్స్యకారుల ఆందోళనకు సంఘీభావం తెలిపేందుకు వచ్చిన నాయకులను సెక్షన్ 30 అమల్లో ఉందని చెబుతూ అడ్డుకుంటున్నారు. గ్రామానికి చెందిన వారైతే ఆధార్ కార్డు చూసి వదులుతున్నారు. పలువురు పోలీసులు మఫ్టీ డ్రెస్సులో (యూనిఫాం లేకుండా) సాధారణ పౌరుల దుస్తులతో విధులు నిర్వహిస్తూ, మత్స్యకారుల కదిలికను కని పెడుతున్నారు. వజ్ర వాహనాన్ని కూడా అందుబాటులో ఉంచుకున్నారు. రాజయ్య పేటలో పోలీసు కవాతు నిర్వహించారు.రాజయ్యపేట వెళ్లే మార్గాల్లో పోలీస్ పికెట్లు ఏర్పాటు చేసి, వాహనాలు తనిఖీ చేస్తూ ఆధార్ కార్డులు అడుగుతున్నారని, దీనివల్ల చాలా ఇబ్బందులు పడుతున్నామని రాజయ్యపేట మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు. మత్స్యకార యువకులు టీ షర్టులపై ఆధార్ కార్డును ప్రింటింగ్ చేయించుకుని, ఆ షర్టులు వేసుకుని తిరుగుతున్నారు. పోలీసులు భయభ్రాంతులకు గురి చేయడం ఎంతవరకు సమంజసం అని మత్స్యకారులు ప్రశ్నిస్తున్నారు.



బంక్ సిబ్బందితో మాట్లాడుతన్న ఇఒ

వాడుక నీరు రోడ్డుపైకి వదిలితే చర్యలు

ప్రజాశక్తి-కొత్తకోట:కొత్తకోట హెచ్‌పి పెట్రోల్ బంక్ సమీపంలో బి ఎన్ రోడ్డు శిథిలం కావడానికి పెట్రోల్ బంక్ యాజమాన్యం నిర్లక్ష్యం కారణమని కొత్తకోట పంచాయతీ ఈవో జ్యోతి రెడ్డి అన్నారు. ఆదివారం ఈవో స్థానిక పెట్రోల్ బంక్‌లో వసతుల పై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రోడ్డు కు ఎత్తుగా ఉన్న బంక్ ఎదురు గా ఎటువంటి కాలవలు నిర్మాణం చేపట్టక పోవడంతో వాడుక నీరు రోడ్డుపై కి వస్తోందన్నారు. దీంతో బి ఎన్ రోడ్డు మరింత గోతులు గా మారడం తో పాదచారులు, వాహనదారులు అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. దీపావళి పండగ సందర్భంగా ఎటువంటి అనుమతులు లేకుండా విక్రయిస్తున్న ఇద్దరు వ్యాపారులను ఈ వో హెచ్చరించారు. దీపావళి సామాగ్రి విక్రయాలు చేయాలంటే ఫైర్, పోలీసు, రెవెన్యూ, పంచాయతీ వంటి పలు శాఖల అనుమతులు తీసుకోవాలని ఈ వో సూచించారు.



షాపును పరిశీలిస్తున్న సిఐ

బాణసంచా షాపులను పరిశీలించిన సిఐ


ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ :పెద్ద చెరువు వద్ద ఏర్పాటు చేసిన బాణాసంచా షాపులను నర్సీపట్నం టౌన్ సిఐ గోవిందరావు సందర్శించారు. అనంతరం సిఐ గోవిందరావు మాట్లాడుతూ, పండగ సందర్భంగా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని చిన్నపిల్లలు, వృద్ధులు బాణాసంచా కాల్చేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. షాపులు యజమానులతో మాట్లాడుతూ షాపుకి షాప్ కి మధ్య పది అడుగుల దూరం పాటించాలన్నారు.



చదివిస్తున్న గ్రంథాలయాధికారి

గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:స్థానిక శాఖా గ్రంధాలయంలో చదవడం మాకు ఇష్టం కార్యక్రమం ఆదివారం గ్రంధాలయ అధికారిణి పి.దమయంతి పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు కథలు చదివి వినిపించారు. ఆంగ్ల అక్షరమాలతో పజిల్ గేమ్ ఆడించారు.



చెక్కతో దీపావళి కళారూపం

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని చినదొడ్డిగల్లు గ్రామానికి చెందిన సూక్ష్మ కళాకారుడు దార్ల రవి తన సూక్ష్మ కళ తో దీపావళి పురస్కరించుకుని ప్రజలకు శుభాకాంక్షలు తెలిపాడు. స్త్రీ మూర్తి దీపాలను వెలిగిస్తూ లోకానికి వెలుగు నింపుతున్నట్లుగా చెక్కతో దీపారాధన ప్రమిద దీపాలను చెక్కపై చెక్కి అద్భుత కళా రూపాన్ని ఆవిష్కరించాడు. రవి పలు పర్వదినాల్లో వీలు చిక్కినప్పుడల్లా చెక్కతో పలు కళాఖండాలు ఆవిష్కరించిన విషయం తెలిసిందే. దీపావళి ప్రతి ఇంటా వెలుగును నింపాలని సూక్ష్మ కళాకారుడు దార్ల రవి ఆకాంక్షించాడు.

క్రీడా పోటీల్లో విద్యాంజలి విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి -కొత్తకోట:రావికమతంలో జిల్లా పరిషత్ పాఠశాల క్రీడా మైదానంలో గత రెండు రోజుల పాటు జరిగిన స్కూల్ గేమ్ క్రీడా పోటీలలో రావికమతం మండలం కొత్తకోట విద్యాంజలి పాఠశాలకు చెందిన విద్యార్థులు పలు క్రీడా పోటీలలో తమ సత్తా చాటారు. రావికమతం లో గత 17,18 తేదీలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పలు మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికల అండర్ -17 విభాగంలో పాఠశాలకు చెందిన డోలా నందిని 800 మీటర్స్ రన్నింగ్, చెస్, ఖోఖోలో ప్రథమ స్థానం సాధించింది. అండర్- 14 విభాగం లో ఒడిగొండ మౌనిక ఖోఖో క్రీడా పోటీలకు ఎంపిక కాగా, కబడ్డీ పోటీలకు డి.తుషిత అలేఖ్య, బాలుర విభాగంలో అండర్ -17 లో కబడ్డీ పోటీలకు ఎ. లోకేష్, ఖోఖో పోటీలకు గుమ్మడు అశ్విన్ ఎంపికయ్యారు. అండర్ -14 విభాగంలో చెస్ పోటీలకు జి.తనుష్, కోకో పోటీ లకు ఎమ్.వంశీ, ఎస్ వంశీ ఆయా క్రీడా పోటీ లలో పాల్గొనున్నారు.బ్యాడ్మింటన్ విభాగంలో ఎస్. భరత్, ఎమ్. మోహన్, ఎస్. జస్వంత్, కబడ్డీ క్రీడా విభాగంలో పి.దుర్గా, 400 మీటర్స్ రన్నింగ్ రేస్ విభాగంలో ఎ.జస్వంత్ ఎంపికయ్యారని, వీరంతా ఈ నెల 21,22,23 తేదీ లలో పెద్ద బొడ్డేపల్లి లో జరిగే డివిజనల్ క్రీడా పోటీలలో పాలో న్నారని విద్యాంజలి స్కూల్ ప్రిన్సిపాల్ గట్టా వరప్రసాద్, పీడీ జగదీష్ తెలిపారు.



విజేత విద్యార్థులతో ప్రిన్సిపల్ వరప్రసాద్, పీడీ

మొక్కల నాటివేత

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్: భగవాన్ శ్రీ సత్య సాయి బాబా శత జయంతి వేడుకల భాగంగా ఆదివారం నర్సీపట్నం సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో బలిఘట్టంలోని బ్రహ్మలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో 100 మొక్కలను నాటారు. మొక్కలు నాటడంతో పర్యావరణానికి పరిరక్షణ కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ గవిరెడ్డి రమణ, జిల్లా బాలవికాస్ ఇంచార్జ్ శక్తి మూర్తి, సమితి కన్వీనర్ రామకృష్ణ, రామచంద్రరావు మాస్టారు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న సేవా సమితి ప్రతినిధులు



విరాళం అందిస్తున్న దాతలు

ఆలయానికి విరాళం

ప్రజాశక్తి- మాడుగుల:మాడుగులలో వెంకటేశ్వర స్వామి ఆలయానికి అదే గ్రామానికి చెందిన కీర్తిశేషులు పాలకుర్తి వెంకట భీమరాజు కుమారులు సురేష్ కుమార్ (ఎల్ ఐ సి),సునీల్, శుభాష్ లు 30 వేలు, చేకూరి గోవింద్ ఉష దంపతులు 10 వేలు, బొమ్మిశెట్టి శ్రీనివాస్ దంపతులు 5 వేలు, కుక్కర మోదకొండ, మహేశ్వరీ దంపతులు 2 వేలు, శ్రీనాద్ సత్యనారాయణ మూర్తి, సరస్వతి దంపతులు 11 వేల 511 రూపాయలు నగదును ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ పాలకుర్తి సురేష్ కుమార్ కి ఆదివారం అందజేశారు.ఈ కార్యక్రమం లో ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

మరిడిమాంబ విగ్రహం ఊరేగింపు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని జోగంపేట గ్రామంలో మరిడిమహాలక్ష్మి అమ్మవారి ఉత్సవ విగ్రహం ఊరేగింపు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమం సర్పంచ్ జువ్వల లక్ష్మి దేముడు కుటుంబ సభ్యులు ఆద్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నాయకులు

నిర్బంధానికి వ్యతిరేకంగా వినూత్న నిరసన

ప్రజాశక్తి -ఎస్ రాయవరం : బల్క్ డ్రగ్స్ పార్క్‌ను రద్దు చేయడంతోపాటు పోలీసుల అక్రమ గృహ నిర్బంధాలు ఆపాలని డిమాండ్ చేస్తూ మండలంలోని పెద్దగుమ్ములూరులో సిపిఎం ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చి వినూత్నంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మోర్త సత్యనారాయణ మాట్లాడుతూ తమ జీవనోపాధిని హరించే బల్క్‌డ్రగ్ పార్కు వద్దని రాజయ్యపేట గ్రామంలో మత్స్యకారులందరూ 36 రోజులుగా శాంతియుతంగా నిరసన దీక్షలు చేస్తుంటే, హోంమంత్రిగా ఉన్న స్థానిక ఎమ్మెల్యేగానీ, కూటమి ప్రభుత్వంగానీ స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. రాజయ్యపేటలో పోలీసుసెక్షన్ 30ని అమలు చేసి, ఉద్యమాన్ని అణచివేసేలా అక్రమ గృహనిర్బంధాలకు పాల్పడడం సరికాదన్నారు. మత్స్యకారుల న్యాయమైన పోరాటానికి సిఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, హోంమంత్రి అనిత స్పందించి, బల్క్ డ్రగ్ పార్కు రద్దు ప్రకటన వెంటనే చేయాలని డిమాండ్ చేశారు. నిర్బంధాలతో ఉద్యమం అగదని, బాధిత మత్స్యకారులను ఐక్యం చేసి మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం రాజేష్, నాయకులు కొర్ర ప్రసాద్, వియ్యపు వీరబాబు, ఏనుగుపల్లి రాములు, భాస్కర్, తరిపా అప్పారావు పాల్గొన్నారు.

36వ రోజుకు రిలే దీక్షలు

ప్రజాశక్తి -నక్కపల్లి: తమని సముద్రానికి దూరం చేయొద్దని గంగపుత్రులు తెలిపారు. మండలంలో మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో బల్క్ డ్రగ్ వ్యతిరేకిస్తూ మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత రిలే దీక్షలు ఆదివారం నాటికి 36వ రోజుకు చేరుకుంది. బల్క్ డ్రగ్ వ్యతిరేకిస్తూ మత్స్యకారులు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. తమ జీవన విధానాన్ని దెబ్బతీస్తే బల్క్ డ్రగ్ ను ఏర్పాటు చేయాలని చూస్తే తమ ప్రాణాలు సైతం లెక్కచేయకుండా పోరాడుతామని మత్స్యకారులు స్పష్టం చేశారు. బల్క్ డ్రగ్ రద్దు చేసే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు బి.బాబ్జి, మత్స్యకార నాయకులు పిక్కి తాజీలు, మహేష్, కాశి, మహేష్, రమణ, సూరిబాబు, రామ్ చరణ్, కోదండ పాల్గొన్నారు.



ఆర్‌డిఒ, సిఐలకు వినతిపత్రాన్ని ఇస్తున్న మత్స్యకారులు

కలెక్టర్ పర్యటనను వాయిదా వేయండి

ప్రజాశక్తి -నక్కపల్లి:మత్స్యకారులు పూర్తిస్థాయిలో అందుబాటులో లేరు.. కలెక్టర్ పర్యటన వాయిదా వేయాలని అధికారులకు ఆదివారం మత్స్యకారులు వినతిపత్రం అందజేసారు. మండలంలో మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో బల్క్ డ్రగ్ పార్కును వ్యతిరేకిస్తూ మత్సకారులు శాంతియుతంగా రిలే దీక్షలు చేపట్టినప్పటికీ ప్రభుత్వం స్పందించలేదన్న ఉద్దేశంతో మత్స్యకారులు ఈనెల 12వ తేదీన నక్కపల్లి లో హైవే దిగ్బంధం చేయడంతో, జిల్లా కలెక్టర్ ఆందోళనకారుల వద్దకు వచ్చి ఈనెల 15వ తేదీన రాజయ్యపేట వచ్చి మాట్లాడతానని హామీ ఇవ్వడంతో మత్స్యకారులు సాధించి ఆందోళన విరమించారు. 15వ తేదీన వ్యక్తిగత కారణాలవల్ల జిల్లా కలెక్టర్ రాలేకపోవడంతో ఆ రోజు కార్యక్రమం రద్దయింది. ఇందుకు సంబంధించిన కారణాలను ఆర్డిఓ వివి రమణ 14వ తేదీన మత్స్యకారులకు తెలియజేశారు. 18న శనివారం రాత్రి 8 గంటల సమయంలో ఆర్డిఓ వివి రమణ, తహసిల్దార్ నరసింహామూర్తి, సిఐ మురళి రాజయ్యపేట వెళ్లి జిల్లా కలెక్టర్ 19న ఆదివారం వస్తున్నట్లు శిబిరం వద్ద ఉన్న మత్స్యకారులకు తెలియజేసారు. ఈ మేరకు పలువురు మత్స్యకారులు ఇప్పటికిప్పుడే చెబితే ఎలా అని, గ్రామానికి చెందిన మత్స్యకారులు పనుల్లోకి, ఇతర ప్రాంతాలకు వెళ్లడం జరిగిందని, గ్రామానికి చెందిన మత్స్యకారులు పూర్తిస్థాయిలో అందుబాటులో లేరని , జిల్లా కలెక్టర్ పర్యటన వాయిదా వేయాలని కోరారు. దీంతో అధికారులు వెనుదిరిగారు. గ్రామ సభకు మత్స్యకారులు ఎవ్వరూ వెళ్ళరాదని నిర్ణయం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార నాయకులు గోసల సోమేశ్వరరావు, బైరాగి రాజు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు తీర్మానం

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని పప్పుశెట్టి పాలెం గ్రామపంచాయతీ నిధులు రూ.1.84 లక్షలు కాజేసి తిరిగి చెల్లించక పోవడంతో సర్పంచ్ విజయలక్ష్మి భర్త రామకృష్ణనాయుడు పై చర్యలు తీసుకోవాలని ఆదివారం పంచాయతీ పాలకవర్గం సమావేశంలో తీర్మాణం చేసారు. గత సంవత్సరం నిధుల దుర్వినియోగం ఆరోపణలతో సర్పంచ్ చెక్ పవర్ రద్దు చేయగా, అప్పటి నుంచి పంచాయతీ వ్యవహారాలు ఇన్‌చార్జ్ ఎంపీడీవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి. శనివారం ఎంపీడీవో శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన పాలకవర్గ సమావేశంలో ఉప సర్పంచ్ మాకిరెడ్డి వరహాలుబాబు మాట్లాడుతూ నిధులు తిరిగి చెల్లించకపోవడంతో చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాస్ మాట్లాడుతూ పంచాయతీ నుంచి నిధులు దుర్వినియోగం పై ఇప్పటికే జిల్లా డిపిఓ కు ఫిర్యాదు చేయడం జరిగిందని, సర్పంచ్ విజయలక్ష్మీ భర్తకు రెండు నోటీసులు ఇవ్వడం జరిగిందని, ఈనెల 24తో గడువు పూర్తి కాబోతుందని నగదు రికవరీ చేయకపోతే చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. పంచాయతీ పాలకవర్గ సమావేశంలో పంచాయతీకి నిధులు మంజూరు చేయడంపై పలు తీర్మానాలు చేస్తూ డ్రైనేజీ కాలవల్లో పూడికతీత, నర్సింగపల్లి గ్రామంలో సిసి రోడ్లో కల్వర్టు కూలుపోవడం, వీధిలైట్లు ఏర్పాటు చేయాలని సభ్యులు తీర్మానం చేశారు..



తీర్మానం చేపడుతున్న సభ్యులు

ఘనంగా ఆయుర్వేద దినోత్సవం

ప్రజాశక్తి- పాయకరావుపేట : పట్టణంలోని శ్రీ ప్రకాష్ ఆయుర్వేద ఆసుపత్రిలో ఆయుర్వేద మూల పురుషుడు ధన్వంతరి జయంతి, జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రకాష్ ఆయుష్ చారిటబుల్ అండ్ రీసెర్చ్ ట్రస్ట్ వ్యవస్థాపకులు సిహెచ్ వి కె నరసింహారావు, రామసీత దంపతులు ధన్వంతరి హోమం నిర్వహించారు. ఆయుర్వేద వైద్యులు కన్నాలయం గోపాలన్ రవీంద్రన్, ప్రవచన కర్త, చాగంటి కోటేశ్వరరావు పాల్గొన్నారు. అతిధులను శ్రీప్రకాష్ విద్యార్థులు కోలాటం, పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆయుర్వేద ఆసుపత్రి ట్రస్టీ డాక్టర్ యు ఇందూలాల్, సైకలాజికల్ కౌన్సిలర్ అపర్ణ శర్మ, ప్రకాష్ విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్ విజయ్‌ప్రకాష్, ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, డాక్టర్ టి రమేష్‌బాబు, డాక్టర్ ఎమ్ఎ సుమయ్య, ఆయుర్వేద ఆసుపత్రి సిబ్బంది, ప్రకాష్ ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



అతిథిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

కొనసాగిన అద్దె బస్సు డ్రైవర్ల సమ్మె

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ:వాల్తేర్ డిపోలో అద్దె బస్సు డ్రైవర్ల సమ్మెను రెండవ రోజైన ఆదివారం కొనసాగించారు. దీంతో, డిపోలోని 29 అద్దె బస్సులు రెండవ రోజు కూడా కదలకుండా ఆగిపోయాయి. సమ్మెలో భాగంగా డిపో గేటు ముందు నిరసన చేపట్టారు. జీతం రూ. 26000 కు పెంచాలని, పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని, జిల్లా బస్సు పాస్, నైట్ హాల్ట్ అలవెన్సులు ఇవ్వాలని, ఆర్టీసీ మేనేజ్మెంట్ వేధింపుల ఆపాలని, దసరాకి ఒక నెల జీతం బోనస్ గా ఇచ్చి రెండు జతలు బట్టలు ఇవ్వాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అద్దె బస్ డ్రైవర్ల సంఘం వాల్తేరు డిపో కార్యదర్శి బి. జంపన్న మాట్లాడుతూ, గతంలో అద్దె బస్సు యాజమాన్యం జీతాలు పెంచి రెండు సంవత్సరాలకు అగ్రిమెంట్ ఇచ్చిందన్నారు. అగ్రిమెంట్ కాలం పూర్తయి సంవత్సరం గడుస్తున్నా డ్రైవర్ల జీతాలు పెంచకపోవడం అన్యాయమని విమర్శించారు. జీతాలు పెంచే వరకు సమ్మె కొనసాగిస్తామన్నారు. వాల్తేరు డిపో అద్దె బస్సు డ్రైవర్ల సంఘం అధ్యక్షులుపి.రఘు మాట్లాడుతూ అద్దె బస్సు డ్రైవర్ల న్యాయమైన డిమాండ్లు పరిష్కారం చేయకపోతే ఈ సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఆర్టీసీ అధికారులు ఇప్పటికైనా చొరవ చూపి అద్దె బస్సు డ్రైవర్ల జీతాలు పెంచి న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరారు.